మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల/నారాయణపేట



# అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వానికి నివేదిస్తాం: కలెక్టర్

**వనపర్తి జిల్లా ప్రతినిధి, మార్చి 25 ప్రభాతవార్త:** ఇటీవల కురిసిన అకాల వర్షం, వడగండ్ల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కొత్తకోట మండల పరిధిలోని సంకిరెడ్డి పల్లి గ్రామంలో అకాల వర్షం కారణంగా నష్టపోయిన వరి పంటలను కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందు నాయక్‌తో కలిసి పరిశీలించారు. వెంకట్ రాములు అనే వరి రైతు పొలాన్ని సందర్శించి రైతుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సంకిరెడ్డిపల్లిలో మొత్తం ఎన్ని ఎకరాల్లో పంట డామేజ్ అయిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆరా తీయగా, వ్యవసాయ శాఖ సర్వే చేసిన ప్రకారం 170 ఎకరాల్లో పంట డామేజ్ అయిందని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వడగండ్లు, అకాల వర్షం కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వానికి పూర్తి వివరాలు నివేదిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మోడల్ హౌస్ సందర్శన కొత్తకోట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు మోడల్ హౌస్ ను కలెక్టర్ సందర్శించారు. వేగంగా పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులకు ఆదేశించారు. ఇంకా మోడల్ హౌస్ నిర్మాణం ప్రారంభం కాని మండలాల్లో వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు నాయక్, హౌసింగ్ పీడీ పర్వతాలు, డిఈ విటోభా, ఉద్యాన శాఖ అధికారి అక్బర్, తహసిల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



వరి పంటలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి

## మహిళలు వినూత్న ఆలోచనలతో
# ముందుకు సాగాలి

**నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణపేట టౌన్, మార్చి 25 ప్రభాతవార్త :** వ్యాపార రంగంలో మహిళలు వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. నారాయణ పేట జిల్లా కేంద్రంలో జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రారంభించడం, దేశంలోనే మహిళా సమాఖ్య ద్వారా నడిపే పెట్రోల్ బంక్ ఇదే కావడంతో నారాయణ పేట జిల్లాకు ఎంతో పేరు, ప్రఖ్యాతలు వచ్చాయని, నిజంగా ఇది జిల్లా మహిళలు సాధించిన గొప్ప విజయమని కలెక్టర్ తెలిపారు. నారాయణ పేట జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో మంగళవారం జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జిల్లా మహిళా సమాఖ్య సభ్యులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు వ్యాపార రన్నగలో రాణిస్తారని, పొదుపు అంటేనే మహిళలు మహిళలు అంటేనే పొదుపు అనే నానుడి ఉందన్నారు. అయితే మహిళలు వ్యాపార వేత్తలు గా ఎదగడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సులు,రైస్ మిల్లులు, సోలార్ పవర్ ప్లాంట్స్ ఇస్తోందని తెలిపారు. మహిళలు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగానిలదొక్కుకోవాలన్నారు. మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్ ఏర్పాటుతో నారాయణ పేట జిల్లాకు దేశ వ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చిందని, అదే విధంగా ఇంకా ఏదైనా వినూత్నంగా ఆలోచించి వ్యాపార పరంగా జిల్లా మహిళా సమాఖ్య మరో ముందడుగు వేయాలని ఆమె కోరారు. జిల్లా సమాఖ్య సభ్యులు అందరూ చర్చించి ఇంకా వేరే ఏదైనా వ్యాపారం చేయాలని అనుకుంటే డిఆర్‌డీఏ కు తెలపాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గ్యాంగ్వర్ ను జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చంద్రకళ శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. అలాగే జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులతో పాటు అన్ని మండలాల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులను జిల్లా కలెక్టర్ జ్ఞాపిక, శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మొగులప్ప, అడిషనల్ డిఆర్‌డిఓ అంజయ్య, జిల్లా సమాఖ్య కార్యదర్శి, కోశాధికారి, అన్ని మండలాల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

# గంజాయి, కల్తీ కల్లు నిర్మూలిద్దాం

**మత్తుకు యువత దూరంగా ఉండాలి : ఎస్పీ జానకీ**

**మహబూబ్‌నగనర్ బ్యూరో, మార్చి 25, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా గంజాయి, కల్తీ కల్లు నిర్మూలనకు సంబంధించి అవగాహన కల్పించేందుకు తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో తరఫున ప్రచార కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకీ ఆదేశించారు. ఈమేరకు ఎస్పీ డి.జానకి ప్రత్యేకంగా తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో వారు రూపొందించిన "గంజాయి కల్తీ కల్లు నిర్మూలన" పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, "యువత ప్రజలు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి. గంజాయి, కల్తీ కల్లు వంటి నిషేధిత పదార్థాల వినియోగం వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా, సమాజ పరంగా తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఎవరైనా గంజాయి విక్రయం లేదా కల్తీ కల్లు తయారీ, సరఫరా, వినియోగానికి పాల్పడినట్లు సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా వుంచబడును. మత్తుమందుల వ్యసనాన్ని నిర్మూలించేందుకు అందరూ కలిసి పనిచేయాలి" అని ఎస్పీ గారు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నార్కోటిక్ బ్యూరో బుచ్చయ్య, రమణా రెడ్డి, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో ఈ ప్రచారాన్ని మరింత బలపరచడానికి రద్దీ ప్రదేశాలలో, స్కూల్, కాలేజీల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ ఇతర పోలీస్ అధికారులకు తెలిపారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్పీ జానకీ

# మరో మృతదేహం లభ్యం

- ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మనోజ్‌కుమార్‌గా గుర్తింపు
- బాధిత కుటుంబానికి రూ.25లక్షల నష్టపరిహారం అందజేస్తాం
- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ వెల్లడి
- టన్నెల్‌లో నిరంతరంగా కొనసాగుతున్న సహాయక చర్యలు



సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న కలెక్టర్



మృతదేహాన్ని అంబులెన్స్‌లో తరలిండస్తున్న దృశ్యం (ఇన్‌సెట్లో) మనోజ్‌కుమార్ (ఫైల్)

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి25, ప్రభాత వార్త:**నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం దోమల పెంట గ్రామంలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మందిలో మార్చ్ 9వ తేదీ ఆదివారం రాత్రి పంజాబ్ రాష్ట్రానికి చెందిన గురుప్రీత్ సింగ్ మృతదేహం లభించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో మంగళవారం జయప్రకాష్ అసోసియేట్స్ లిమిటెడ్ కంపెనీలో ఇంజనీర్‌గా విధులు నిర్వహించిన ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అర్జున్ ప్రసాద్, జమున దేవి దంపతుల కుమారుడు మనోజ్ కుమార్ మృతదేహంగా గుర్తించినట్లు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు.ప్రభుత్వం తరఫున రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా వారి కుటుంబ సభ్యులకు అందించనున్నట్లు తెలిపారు.అదేవిధంగా వైద్య పరీక్షల అనంతరం మృతదేహాన్ని వారి స్వగ్రామానికి తరలించనున్నట్లు తెలియజేశారు. ఉత్తం ప్రదేశ్ రాష్ట్రం ఉన్నావ్ జిల్లా బంగార్మౌ గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్‌కు భార్య స్వర్ణలత,కుమారుడు ఆదర్శ్,కుమార్తెశైలజ ఉన్నారు. కేంద్ర, రాష్ట్రాలకు చెందిన వివిధ విభాగాలతో పాటు ప్రైవేటు సంస్థలన్నీ కలిపి 25ఏజెన్సీలు సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నాయి. 700మంది సిబ్బంది ఈ ఆపరేషన్‌లో నిమగ్నమై,సొరంగంలో కూలిన రాళ్లు,టీబీఎం విడిభాగాలను వెల్డింగ్‌చేసి బయటకు తీస్తున్నారు. ఎప్పటికప్పుడు అక్కడ పేరుకున్న మట్టి, రాళ్ల దిబ్బలు, పూడిక, ఊట నీటిని బయటకు తొలిగిస్తున్నారు. రెస్క్యూ ఆపరేషన్ కళ్లకు కట్టించేలా ప్రమాదం జరిగిన రోజున, ఇప్పుడున్న పరిస్థితుల ఫొటోలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ప్రదర్శిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో 30మీటర్లు అత్యంత ప్రమాదకర జోన్ గా గుర్తించారు. ఇదిలా ఉండగా ఎస్ఎల్‌బీసీ ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను బయటకు తెచ్చేందుకు అవసరమైన సహాయక చర్యలను కొనసాగించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఇప్పటికే ఆదేశించారు. సహాయక చర్యలను నిరంతరం దగ్గరుండి పర్యవేక్షించేందుకు ఐఏఎస్ అధికారి శివశంకర్ లోతేటిని ప్రత్యేకాధికారిగా నియమించిన సంగతి తెలిసిందే.

# జోగులాంబ ఆలయ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

**జిల్లా కలెక్టర్ సంతోష్ అధికారులకు ఆదేశాలు**

**గద్వాల, మార్చి 25 ప్రభాతవార్త :** జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించి కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం, ఆలంపూర్ యొక్క ఆధ్యాత్మిక/యాత్రా అవసరాలు, స్థిరమైన పర్యాటకాన్ని దృష్టిలో ఉంచుకొని సమగ్ర పునర్వ్యవస్థీకరణ ప్రధాన ప్రణాళికపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జోగులాంబ దేవస్థానం అభివృద్ధి కొరకు ఏర్పాటైన పర్యవేక్షణ అభివృద్ధి కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలంపూర్ పునరుద్ధరణ ప్రణాళికను ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఆలంపూర్ తెలంగాణలో ఏకైక శక్తిపీఠంగా ఉన్నందున, దీని ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని దేవాలయ అభివృద్ధితో పాటు పర్యాటక అభివృద్ధి చెందే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు, ఆలయ పరిసరాల అభివృద్ధి, సమగ్ర ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. ప్రసాద్ పథకం భవనానికి నీటి సరఫర కోసం మున్సిపల్ కమిషనర్, ఇంట్రా ఈ.ఈ, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లు నది నుంచి నీటి శుద్ధి విషయంపై ఫీల్డ్ విజిట్ నిర్వహించి, 15 రోజుల్లో వ్యయ అంచనాలను సమర్పించాలన్నారు. ప్రసాద్ పథకం భవనాన్ని టూరిజం శాఖ అధికారులు వెంటనే దేవదాయ శాఖకు అప్పగించాలని సూచించారు. దేవాలయానికి అనుసంధానించే రహదారుల అభివృద్ధికి గాంధీ జంక్షన్ నుండి ఆలయం వరకు రహదారి వివరాలు సిద్ధం చేయాలని, మురుగునీటి కాలువ వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. దేవాలయ పరిసర ప్రాంతాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టం ను, భక్తులకు త్రాగునీటి సదుపాయంతో పాటు క్లాక్ రూమ్ ఏర్పాటు కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. హైదరాబాద్, కర్నూలు నుండి ఆలంపూర్ మార్గాల్లో దిశానిర్దేశక బోర్డులు, నంది శివ చత్రువుల్లో సూచికలు ఏర్పాటు చేయాలని, అలాగే బస్టాప్, ఆటోస్టాండ్ అభివృద్ధి, సైన్‌బోర్డులు, గోడలపై పెయింటింగ్ పనుల కోసం ఫీల్డ్ విజిట్ నిర్వహించి 15 రోజుల్లో లైన్ అంచనాలను సమర్పించాలని ఆర్‌అండ్‌బి శాఖకు ఆదేశించారు. ప్రస్తుత పార్కింగ్ ప్రాంతంలో మొక్కలు నాటి గ్రీనరీని పెంచాలని, టాయిలెట్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని పర్యాటక శాఖ అధికారులకు ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో శుభ్రత నిర్వహణ, పచ్చదనం పెంపొందించేందుకు వృక్షార్చన, చెట్లను నాటడం, పర్యావరణ అనుకూల అభివృద్ధి చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఆలయ అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని అధికారులకు ఆదేశించారు. దేవాలయం వద్ద అభివృద్ధి పనులు చేపట్టేందుకు శాఖల వారీగా వారం రోజులలో ప్రతిపాదనలను అందజేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, ఆర్డీఓ శ్రీనివాసరావు, రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణ రావు, అసిస్టెంట్ స్థపతి గణేష్, ఆర్కిటెక్ట్ సూర్య నారాయణ మూర్తి, టెంపుల్ డిజైనర్ గోవింద హరి, ఏడీ ఆర్కియాలజీ నాగలక్ష్మి, ఈ.ఓ పురేందర్, డిపిఓ నాగేంద్రం, అలంపూర్ తహశీల్దార్ మంజుల, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రావు, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి ఎస్.ఈ. వనజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జోగులాంబ ఆలయ అభివృద్ధికి అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ సంతోష్

## ఆర్అండ్‌ఆర్ పనులు
# వేగవంతం చేయాలి

- నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలి
- ఆర్ అండ్ ఆర్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశం
- కలెక్టర్ విజయేంద్ర బోయితో కలిసి సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కృష్ణారెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 25, ప్రభాతవార్త:** ఉదండపూర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలకు కేటాయించిన అర్అర్ కాలనీలలో అన్ని రకాల మౌలిక సౌకర్యాలు వేగవంతం చేయాలని ఆర్ అండ్ ఆర్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో ఆర్ అండ్ ఆర్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి,జిల్లాకలెక్టర్ విజయేందిర బోయితో కలిసి రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖ అధికారులతో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో అర్ అర్ పనులు సమీక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదండపూర్ రిజర్వాయర్ కింద వల్లూరు, ఉదండపూర్,తుమ్మల కుంట తండా, రేగడి పట్టితండా,చిన్నగుట్ట తండా,శామ గడ్డ తండా, ఒంటి గుడిసె తండా, పోలేపల్లి వ్యవసాయ క్షేత్రంలో ఇండ్లు,కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు అవార్డు అందుకున్న వారందరికి పునరావాసం కింద మూడువందల గజాలస్థలం,వారి అవసరాలకు ప్రైమరీ హెల్త్ సెంటర్, పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, వెటర్నరీ హాస్పిటల్, కమ్యూనిటీహాల్స్,పార్కులను ఏర్పాటు పనులు నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ వాటర్ పైపులైన్లు ఇచ్చిన గడువులోగా త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని అన్నారు.ఇంజినీరింగ్ అధికారులు పనుల నిర్వహణలో అలసత్వం వహించ రాదని అన్నారు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అర్ అర్ కింద తీసుకున్న చర్యలు వివరించారురెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, స్పెషల్ కలెక్టర్ (ఎల్. ఎ.) మధుసూదన్ నాయక్, ఆర్డీవో నవీన్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, సర్వే లాండ్ రికార్డు, పంచాయతీరాజ్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుల పంపిణీ



లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న మంద పాండు రంగారెడ్డి

**వంగూరు, మార్చి 25 ప్రభాతవార్త:** వంగూరు మండలం మిట్టసదగొడు గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల ప్రచార కమిటీ చైర్మన్ మంద పాండు రంగారెడ్డి ఆధ్వర్యంలో 50 మంది లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యునతికి నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వ 10సంవత్సరాల పాలనలో ఒక రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, అర్హులైన ఎంతో మంది ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి రేషన్ షాపుల ద్వారా సరుకులను పంపిణి చేసి పేద ప్రజలను ఆదుకోవాలనే లక్ష్యంతో రేషన్ కార్డులను లబ్ధిదారులకు మంజూరు చేశారని తెలిపారు. యువత జీవనోపాధి పెంచేందుకు పని కల్పించడానికి యువ శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిన రుణాలు అందుస్తుందని పేర్కొన్నారు. నిరుద్యోగ యువకులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# మహమ్మదాబాద్ మండలంలో పర్యటించిన కలెక్టర్

- నంచర్లలో జడ్పీ పాఠశాల మధ్యాహ్న భోజనం పరిశీలన
- మెనూ పాటించక పోవడంతో ఆగ్రహం
- తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో తాగు నీరు సరఫరా,సాగు, పంటల పై సమీక్ష

**మహ్మదాబాద్, మార్చి 25 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం కూరగాయలు, భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. మంగళవారం మహ్మదాబాద్ మండలంలో కలెక్టర్ పర్యటించారు. మండలంలోని నంచర్ల ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ చేశారు.పాఠశాలలో విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించక పోవడంతో మధ్యాహ్న బోజన నిర్వాహకులు,ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం ఆకుకూరలు, కాయ గూరలు, గుడ్డు అందించాలని ఆదేశించారు. పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ఏఐ ఆధారిత కంప్యూటర్ సిస్టం,ల్యాబ్ పరిశీలించారు.

ఎఫ్ఎల్ఎన్ఏ.ఐ ఆధారిత కంప్యూటర్ సిస్టం ద్వారా మహమ్మదాబాద్ మండలంలో నంచర్ల, గాధిర్యాలలోని పాఠశాలల్లో రెండు చోట్ల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వెనుకబడిన విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ఏఐ ఆధారిత కంప్యూటర్ సిస్టం ద్వారా బోధన చేసి వారి ప్రగతి పరిశీలించాలని అన్నారు. 9వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలల్లో బోధన,సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమ లక్ష్యం మేరకు చదివి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. త్రాగు నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి..

మహమ్మదాబాద్ తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, మిషన్ భగీరథ, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులతో త్రాగు నీరు సరఫరా,సాగు నీరు,పంటల సాగు పై సమీక్షించారు. సంగాయపల్లి,ధర్మాపూర్ గ్రామాల్లో త్రాగు నీరు సరఫరాలో సమస్య ఉన్నట్లు తెలిపారు. త్రాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు వెంటనే ప్రతి పాదనలు సమర్పించాలని ఆమె ఆదేశించారు. మండలంలో పంటల సాగులో వరి పంటపై సమీక్షించారు. బోరు బావుల నీటి సాగుతో వేసిన వరి పంట భూగర్భ జలాలు ఇంకి సుమారు 140 ఎకరాల్లో ఎండినట్లు అధికారులు తెలిపారు. వ్యవసాయ అధికారులు రైతులకు సరైన సలహాలు అందించి అవగాహన కలిగించాలని అన్నారు. అక్కడే పక్కనే ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి కావచ్చి రెండవ తరగతికి కావల్సిన వసతి గురించి కలెక్టర్‌కు వివరించారు. రెండవ సంవత్సరం తరగతుల నిర్వహణ తహశీల్దార్ కార్యాలయంలో తాత్కాలికంగా నిర్వహించి తహశీల్దార్ కార్యాలయంను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు తరలించేందుకు అధికారులతో చర్చించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 1,2, ఎంపిడిఓ కార్యాలయం పరిశీలించి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఒక పాఠశాల రెండవ ప్రాథమిక పాఠశాలకు తరలించి తహశీల్దార్ కార్యాలయంను

ఒక ప్రాథమిక పాఠశాలకు షిఫ్ట్ చేసేందుకు అవకాశాలు పరిశీలించి ప్రతిపాదనలు పంపాలని అన్నారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ తిరుపతయ్య, ఎంపిడిఓ నరేందర్ రెడ్డి, నంచర్ల ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేంద్రబోయి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

# ఆధునిక పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి

**అమరచింత,మార్చి 25 ప్రభాతవార్త :** రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందడానికి ఆధునిక పంటల సాగు వైపు మొగ్గు చూపాలని వనపర్తి జిల్లా కలెక్టర్, ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం అమరచింత మండలంలోని నాగుల్ కడుమూరు గ్రామ రైతు వేదికలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ ఫామ్ పంటలపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు ఎక్కువ కాలం ఒకే పంట వేయకుండా రైతులు పంటల మార్పిడి చేసుకోవాలని ఆయన రైతులను కోరారు. రైతులు ఆయిల్ ఫామ్ పంట సాగుకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందచ్చని ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం డ్రిప్పు సబ్సిడీ ఇస్తుందని పంట సాగు అయిన తర్వాత ఫామ్ ఆయిల్ గింజలను కంపెనీ వారే కొనుగోలు చేస్తారని రైతులు ఎలాంటి ఇబ్బందులు చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం ప్రత్యేకంగా చట్టం తీసుకొచ్చిందని ఆయన చెప్పారు. వనపర్తి జిల్లాలో ఆయిల్ ఫామ్ 5500 ఎకరాలలో సాగు జరుగుతుందని ఆయిల్ ఫామ్ పంటలకు ఎలాంటి చీడ పీడ బాధలు ఉండవని రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేయడానికి ఆసక్తి ఉంటే ఇతర ఏరియాలో సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాలకు ప్రభుత్వం తరఫున రైతులను తీసుకువెళ్తామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి రైతులకు తెలిపారు. అనంతరం ఆయిల్ ఫామ్ పంటలు సాగు చేస్తున్న రైతులు వారి అనుభవాలను తెలిపారు. రైతులు జిల్లా కలెక్టర్ ను శాలువా పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు నాయక్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి అక్బర్, తహశీల్దార్ రవికుమార్ ఇతర అధికారులు రైతులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## ఊరకుంటలో అనుమతి లేకుండా బోరు డ్రిల్లింగ్

**- అడ్డుకున్న కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి**

**- చెరువులను కాపాడాలని సూచన**



బోరును డ్రిల్లింగ్‌ను అడ్డుకున్న కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి

**జడ్చర్ల, మార్చి 25 ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని ఊరకుంట చెరువులో మంగళవారం అక్రమంగా వేస్తున్న విషయాన్ని తెలుసుకున్న 24వ వార్డు కౌన్సిలర్ ప్రశాంత్ రెడ్డి అక్కడికి చేరుకుని బోరును నిలిపి వేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ చెరువులను పరిరక్షించే బాధ్యత అందరిపై ఉంటుందని అధికారులకు కూడా అనుమతులు ఇచ్చేటప్పుడు బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్రొహిబిటెడ్ ఏరియాలో ఉన్నయా చూసుకోవాలని కోరారు. అనుమతులు లేకుండా ఇష్టారీతిగా బోర్లు డ్రిల్లింగ్ చేయడం వల్ల భవిష్యత్తు ఇబ్బందిగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తులతో పాటు చెరువులను కూడా కాపాడాలని కోరారు.రోడ్డును ఆక్రమించి దుకాణాదారులు ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దని సూచించారు. మున్సిపల్ పరిధిలోని అనుమతి లేకుండా రోడ్లు తవ్వుతున్నారని అలా చేయొద్దని కోరారు. ప్రజలకు అసౌకర్యం కలిగించొద్దని అలాంటి వారిపై ఉపేక్షించేది లేదన్నారు.

## వంద రోజులు పని కల్పించాలి ఎంపీడీఓ వెల్లడి

**ఆత్మకూరు, మార్చి 25 ప్రభాతవార్త :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఆత్మకూరు మండలంలోని ప్రతి గ్రామంలో వందరోజుల పనిని కూలీలకు కచ్చితంగా కల్పించాలని ఆత్మకూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపాదు వెల్లడించారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఉపాధి హామీ పథకానికి సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్లు ఆయా గ్రామాలలో పనులను ఎంపిక చేసుకుని కూలీలకు వంద రోజుల పనిని కచ్చితంగా కల్పించాలని కనీస కూలీ చెల్లించే విధంగా పనులను నిర్దేశించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కూలీలకు సరైన సమయానికి వేతనాలు చెల్లించాలంటే ఫీల్డ్ అసిస్టెంట్లు తగు జాగ్రత్తలు తీసుకొని కూలీలకు ఎప్పటికప్పుడు వేతనాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అందుకు సంబంధించి ఎంపీడీఓ కార్యాలయం నుండి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకునే బాధ్యత తమపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఏపీఎం శ్రీరామ్ రెడ్డి మండలానికి సంబంధించిన పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## సూక్ష్మజీవుల అద్భుతాలపై ఒక రోజు కార్యాశాల



కార్యశాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ డా.జి.సుకన్య

**జడ్చర్ల, మార్చి 25 ప్రభాతవార్త :** సూక్ష్మజీవ శాస్త్ర విభాగం, డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ కళాశాలలో మంగళవారం సూక్ష్మ జీవుల అద్భుతాలు సాధారణ వృక్షజాలం గుండా ఒక ప్రయాణం అనే అంశంపై ఒక రోజు కార్యశాల (వర్క్‌షాప్) ను నిర్వహించారని ప్రిన్సిపల్ డా.జి.సుకన్య తెలిపారు. ఇటువంటి వర్క్‌షాప్‌ల ద్వారా విద్యార్థులలో జ్ఞానం, నైపుణ్యాలు మెరుగుపరచడానికి ఎంతో దోహదపడతాయన్నారు. ముఖ్యవక్తగా విచ్చేసిన ఎన్.టి.ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, మహబూబ్‌నగర్ డా. జె. శ్రీదేవి, సహాయ ఆచార్యులు జడ్చర్ల ప్రాంతంలోని సాధారణ సూక్ష్మ జీవజాలం, దాని ప్రాముఖ్యత, వేరు చేసే పద్ధతులు, ప్రస్తుత పరిశోధనలను గూర్చి విపులంగా వివరించారు. అనంతరం విద్యార్థులకు వివిధ సూక్ష్మజీవులను వేరు చేసే పద్ధతులను, మెలుకువలను నేర్పించారు. సూక్ష్మజీవ శాస్త్ర విభాగాధిపతి డా. ఏ. మాధురి వర్మం జుట్టు యొక్క వివిధ భాగాల నుండి బ్యాక్టీరియాను వేరు చేసి చూపించారు. ఈ వర్క్‌షాప్‌లో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు : సిఐ

**ఆత్మకూరు, మార్చి 25 ప్రభాతవార్త :** ప్రస్తుతం దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు సర్కిల్ పరిధిలోని యువత క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆత్మకూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివకుమార్ హెచ్చరించారు. మంగళవారం సీఐ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం యువత చెడు వ్యసనాలకు త్వరగా ఆకర్షితులవుతున్నారని ఈ విషయాన్ని ముఖ్యంగా కుటుంబంలోని తల్లిదండ్రులు గుర్తించి యువత చెడు దారి పట్టకుండా తగు సూచనలు చేయాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఆత్మకూరు సర్కిల్ పరిధిలోని అమరచింత, ఆత్మకూరు పట్టణాలలో క్రికెట్ బెట్టింగులకు యువత పాల్పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని ఈ విషయంపై కఠినంగా వ్యవహరించడమే కాకుండా తక్షణ చర్యలు చేపట్టేందుకు ఎక్కడికక్కడ పోలీసు పహారా ఏర్పాటు చేయనున్నట్లుగా ఆయన వెల్లడించారు. ఇప్పటికైనా యువత చెడు వ్యసనాలకు దూరం కాకుండా సన్మార్గంలో వ్యవహరించి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎస్సై నరేంద్ర తో పాటుగా పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చెరువును పరిశీలించిన
## తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్, ఎస్ఈ

**శ్రీరంగాపూర్, మార్చి 25 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండలం లోని తాటిపాముల గ్రామంలో గల వీర సముద్ర చెరువును ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ రెడ్డి అదేవిధంగా ఎస్ఈ శ్రీనివాసరెడ్డి చెరువును పరిశీలించడం జరిగింది. ఇదివరకు కురిసిన భారీ వర్షాలకు కట్ట బాగా నాని కుంగి పెద్ద రంధ్రం పడడం జరిగిందని చెరువుకు ప్రమాదం జరుగుతుందని వర్షాకాలంలో చాలా భయానికి గురయ్యామని రైతులు వివరించడం జరిగింది. చెరువుకు సంబంధించిన సమస్యలను పూర్తిగా పరిశీలించడం జరిగింది. చెరువుకు సంబంధించి అలుగు అదేవిధంగా చెరువుకు పడ్డ పెద్ద రంధ్రం, తూమును ఈ పనులను తొందరలోనే ప్రారంభించి పూర్తి చేస్తామని ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ రెడ్డి రైతులకు హామీ ఇవ్వడం జరిగింది. మాజీ ఎంపిటిసి రాజగౌడ్, చెనరాయుడు, బిచ్చన్న నాయుడు, గుగ్గిల అంజి, రవీందర్,వెంకటయ్య, రాములు, వెంకటేశ్వర రెడ్డి, హనుమంతు రెడ్డి, వెంకటేష్, వెంకటయ్య నాయుడు తాటిపాముల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ముట్టడికి
## ఢిల్లీ బయలుదేరిన యూత్ కాంగ్రెస్ నాయకులు

**మహ్మదాబాద్, మార్చి 25 ప్రభాతవార్త :** బిజెపి నియంతృత్వ పోకడలకి నిరసనగా జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ భాను చిబ్ ఇంచార్జి కృష్ణా అల్లవారు ఆదేశాల మేరకి తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి పిలుపుమేరకు నేడు ఢిల్లీలో సంసద్ ఘెరావ్.. పార్లమెంట్ ముట్టడి కార్యక్రమానికి పరిగి నియోజకవర్గం నుండి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎర్రగడ్డ పల్లి జగన్ ఆధ్వర్యంలో ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. నియోజకవర్గ అధ్యక్షులు ఎర్రగడ్డపల్లి జగన్, యూత్ కాంగ్రెస్ వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవర్ధన్ , ఉమ్మడి గండీడ్ మండల అధ్యక్షులు సాయితేజరెడ్డి , పరిగి మండల ఉపాధ్యక్షులు వివేక గౌతమ్ స్వచ్ఛందంగా డిల్లీకి వెళ్లిన వారిలో ఉన్నారు. దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం నిరుద్యోగులను ఆదుకొని ఉద్యోగాలు విడుదల చేస్తామని చెప్పి ఇప్పటికీ విడుదల చేయకపోవడంపై తెలంగాణ రాష్ట్రానికి సంవత్సరానికి లక్ష ఉద్యోగాలు అని చెప్పి ఇప్పటికి ఇవ్వకపోవడంపై అదే విధంగా తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలని యువజన కాంగ్రెస్ నాయకులు పార్లమెంటు ముట్టడికి పిలుపు ఇవ్వడంతో ఢిల్లీలోనే యూత్ కాంగ్రెస్ ఆఫీస్ నుండి ర్యాలీగా రావడంతో జంతర్ మంతర్ ధర్నా చౌక్ వద్ద పోలీసు బలగాలు చుట్టుముట్టి అరెస్టు చేయడం జరిగింది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందించి వెంటనే ఇచ్చిన హామీలు అమలు చేయాలని యూత్ కాంగ్రెస్ పరిగి నియోజకవర్గ అధ్యక్షులు జగన్ ఉమ్మడి గండీడ్ మండల్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సాయితేజ రెడ్డి డిమాండ్ చేయడం జరిగింది. లేనియెడల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాబోవు రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని అన్నారు.

## నారాయణ రెడ్డి, జగదీశ్‌లకు గ్లోబల్ బిజినెస్ అవార్డు




అవార్డు అందుకుంటున్న నారాయణ రెడ్డి

**మహబూబ్‌నగర్, మార్చి 25, ప్రభాతవార్త:** గ్లోబల్ బిజినెస్ అవార్డు అందుకున్న జి.నారాయణ రెడ్డి, కాసోజు జగదీశ్‌గ్లోబల్ బిజినెస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన గ్రేట్ ఇండియన్ ట్యాక్స్ పేయర్స్ అవార్డ్స్ కార్యక్రమం విజయవంతమైంది. భారతదేశంలో నిబద్ధతతో, క్రమంతప్పకుండా ట్యాక్స్ చెల్లిస్తున్న బాధ్యతాయుత పౌరులను గౌరవించేందుకు గ్లోబల్ బిజినెస్ నెట్‌వర్క్ ఛైర్మన్ కదారి శ్రీధర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రెడ్ హిల్స్‌లో ఉన్న ఇండస్ట్రీ భవన్లో కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ మరియు టర్మ్ ఇన్సూరెన్స్ రంగంలో నిబద్ధతతో సేవలు అందిస్తున్న మహబూబ్ నగర్ వాస్తవ్యులు జి. నారాయణ రెడ్డి, కాసోజు జగదీశ్ ఈ అవార్డు అందుకున్నవారిలో ఉన్నారు. ఈ అవార్డు గ్రహీతల సేవలను గిన్నిస్ వరల్డ్ రికార్డ్ గ్రహీత, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డా. వంగిపురం శ్రీనాథాచారి ప్రత్యేకంగా అభినందించారు.

# ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



ఇటిక్యాల మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా కార్యకర్తలు



నిరసన తెలుపుతున్న ఆశాలు



అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేసిన ఆశా వర్కర్లు




సుభాష్ చౌరస్తాలో ధర్నా చేపట్టిన ఆశా కార్యకర్తలు

**ఇటిక్యాల,మార్చి 25 ప్రభాతవార్త:** ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఆశా కార్యకర్తలకు పలు హామీలను ఇచ్చిందని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం చలో హైదరాబాదుకు పిలుపు ఇవ్వగా ఆశ కార్యకర్తలను ప్రభుత్వం ఎక్కడికక్కడే అరెస్టులు చేసిందని అలాగే హైదరాబాదులో వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయం ముందు చేసిన ఆందోళనలో పోలీసులు ఆశా కార్యకర్తలను కొట్టి గాయపరచడం ప్రభుత్వం హేయమైన చర్యకు దిగిందని మండల ఆశా కార్యకర్తలు ఖండించారు. ఆశ కార్యకర్తలు చలో హైదరాబాదుకు పిలుపు ఇవ్వగా అరెస్టులు చేయడంతో దానిని నిరసిస్తూ మంగళవారం ఇటిక్యాల మండల కేంద్రంలోని మండల ఆశా కార్యకర్తల సంఘం సభ్యులు అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సరస్వతి, రాజేశ్వరి, యశోద, నాగేశ్వరమ్మ, కళావతి ఆయా గ్రామాల ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఆశ కార్యకర్తల అక్రమ అరెస్టులను ఖండించండి**

**సిఐటియు మండల అధ్యక్షుడు జక్కుల ఆశన్న**

**ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు సుజాత**

**వీపనగండ్ల, మార్చి 25 ప్రభాతవార్త :** హైదరాబాదులో సోమవారం జరిగిన ఆశ వర్కర్ల సమస్యలపై ధర్నా నిర్వహించిన వారిపై పోలీసులు అక్రమ అరెస్టులు చేస్తూ కేసులు పెట్టడాన్ని ఖండిస్తూ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) వీపనగండ్ల మండల కమిటీ ఆధ్వర్యంలో వీపనగండ్ల అంబేద్కర్ విగ్రహం ముందు మంగళవారం నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు సుజాత మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు సాయి లీల, సిఐటియు మండల నాయకులు ఆశన్న, మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని హైదరాబాదులో శాంతియుతంగా ధర్నా చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పోలీసు బలగాలతో అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఎన్నికల కంటే ముందు ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తామని. కనీస వేతనాలు ఇస్తామని వాగ్దానం చేయడం జరిగింది. వాగ్దానం చేసిన హామీలను అమలు చేయాలని అడుగుతే పోలీసులు పెట్టి అరెస్టులు చేయడం సరైన పద్ధతి కాదని మరి హెచ్చరించారు. వెంటనే ఆశా కార్యకర్తలకు కనీస వేతనం 21,000 ఇవ్వాలని, ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు రాణి, పార్వతమ్మ, సునీత, వెంకటమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**ఇచ్చిన హామీలను నెరవేర్చాలి**

**ఆశా కార్యకర్తల ధర్నా రాస్తారోకో**

**పెబ్బేరు, మార్చి 25 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలంలోని ఆశా కార్యకర్తలు స్థానిక సుభాష్ చౌరస్తా లో మంగళవారం కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ధర్నా రాస్తారోకో చేపట్టారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కనీస వేతనం 18000 చెల్లించాలని, మట్టి ఖర్చులకు 50 వేలు చెల్లించాలని, పిఎఫ్ లు ,ఇన్సూరెన్స్ 50 లక్షలు, ప్రసూతి సెలవులు ,క్యాజువల్ సెలవులు, ఆరు నెలల మెడికల్ సెలవులు, వెంటనే అమలు చేయాలని అసెంబ్లీలో తీర్మానం పెట్టాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని రాస్తారోకోను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో దేవమ్మ, సుజాత, నస్రియాన్ బేగం, నాగమణి, శ్రీదేవి, భారతి ,నర్మద ,రమాదేవి, సరళ తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

**ఆశా కార్యకర్తల అక్రమ అరెస్టులపై నిరసన**

**నవాబుపేట, మార్చి 25 ప్రభాతవార్త :** ఆశా వర్కర్ల డిమాండ్లపై నేడు తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి బయలుదేరిన ఆశ కార్యకర్తలపై పోలీసులు అక్రమంగా దాడులు కేసులు పెట్టడంతో పాటు అరెస్టులకు నిరసనగా నవాబుపేట ఆరోగ్య కేంద్రంలో బైఠాయించి ఆశా వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతకుముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని మాకు రావాల్సిన బెనిఫిట్స్ పండగ సెలవు దినాలు, ప్రసూతి సెలవు దినాలు ఇన్సూరెన్స్,ట్రైనింగ్ పూర్తయిన వారికి ప్రమోషన్ ఇచ్చి వాళ్ళని ఆదుకోవాలని డిమాండ్లతో ఆశా వర్కర్లు కొద్దిరోజులుగా ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆశా కార్యకర్తల బాధలు అర్థం చేసుకొని వారికి రావాల్సిన బెనిఫిట్స్ వారికి కేటాయించాలని ఈ సందర్భంగా వారు నిరసన వ్యక్తం చేశారు. నిన్న కమిషనర్ ఆఫీస్ ముట్టడి చేసినందుకు అక్కడ ఆశ వర్కర్లను పోలీసులు దుర్మార్గంగా అరెస్టు చేసి స్టేషన్‌లో పెట్టారు. దాని కోసమని ఆశ వర్కర్లు స్త్రీలని కూడా చూడకుండా వారిపట్ల దుర్మార్గంగా వ్యవహరించినందుకు దానికి నిరసనగా ఈరోజు పీహెచ్సీ ముందు నల్ల బ్యాడ్జిలను ధరించి నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం సిఐటియు రాష్ట్ర కమిటీ మేరకు ఈ నిర్ణయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు నిర్మల కార్యదర్శి జ్యోతి కోశాధికారి శ్రీమతమ్మ, పిఎస్‌సి ఆశ వర్కర్లు నవాబ్‌పేట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టుపక్కల గ్రామాల ఆశా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని వారి డిమాండ్లను వ్యక్తపరిచారు.

## ఉత్తమ మోటివేషనల్ స్పీకర్ ట్రైనర్‌గా దీపిక ఎంపిక




ఉత్తమ మోటివేషనల్ గా సర్టిఫికెట్ తీసుకుంటున్న దీపిక

**వీపనగండ్ల, మార్చి 25 ప్రభాతవార్త :** ఇంపాక్ట్ ఫౌండర్ ఆధ్వర్యంలో మోటివేషనల్ స్పీకర్ ట్రైనర్ ఆధ్వర్యంలో హైదరాబాదులో నిర్వహించిన క్లాసు లో ప్రముఖ మోటివేటర్ గంప నాగేశ్వరరావు చేత ఉత్తమ మోటివేషనల్ స్పీకర్ ట్రైనర్‌గా సర్టిఫికెట్ దీపిక అందుకున్నారు. ఈ నెల 22,23 తేదీలలో రెండు రోజులపాటు హైదరాబాదు లో జరిగిన రెండు రోజుల మోటివేషనల్ స్పీకర్స్ ట్రైనింగ్ క్లాసులలో వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన దీపిక మొదటి బహుమతి పొందడం జరిగింది. అదేవిధంగా ఇంపాక్ట్ వనపర్తి జిల్లా క్లబ్ ఇన్చార్జిగా ఎన్నికయ్యారు. రెండు రోజుల క్లాసులు ముగింపు రోజు దీపిక మొదటి బహుమతితోపాటు ఇంపాక్ట్ ప్రశంసా పత్రాన్ని ఇంపాక్ట్ ప్రెసిడెంట్ అయిన రామచంద్రుడు, వైస్ ప్రెసిడెంట్ మాధవి, ప్రముఖ సినిమా ఆర్టిస్ట్ ప్రదీప్ కుమార్ చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా దీపిక మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, మహిళలపై అత్యాచారాలు, ఇవి టీజింగ్, డ్రగ్స్, తదితర అభివృద్ధి నిరోధక అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రజల్ని చైతన్యవంతం చేస్తానని అన్నారు. దేశానికి పట్టుకొమ్మలు విద్యార్థులు, యువకులే అని అలాంటి వారి జీవిత లక్ష్యాన్ని ఎంచుకోవడంలో ఇబ్బందులు పడుతుంటారని, వాళ్లలో వాళ్లకు తెలియకుండా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి మోటివేషన్ క్లాస్ లు ఎంతో దోహదపడుతాయని, రానున్న కాలంలో జిల్లావ్యాప్తంగా అనేక పాఠశాలను తిరిగి విద్యార్థులను ఉత్తమ భవిష్యత్తు నిర్మాణం కోసం చైతన్యం చేయనున్నట్టు ఆమె పేర్కొన్నారు. ఈ అవార్డుకి ఎంపిక చేసిన ఇంపాక్ట్ నాయకత్వానికి అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా రానున్న కాలంలో వనపర్తి జిల్లాలో ఇంపాక్ట్ క్లబ్ ఏర్పాటు చేయబోతున్నట్టు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ క్లబ్ లో సమాజ సేవ చేయాలనుకున్న ప్రతి ఒక్కరు జాయిన్ కావచ్చు అని భవిష్యత్తులో గొప్ప ఉపన్యాసకులుగా ఎదగడానికి, సమాజ సేవ చేయడానికి ఇంపాక్ట్ అవకాశం కల్పిస్తుందని, ఈ అవకాశాన్ని ముఖ్యంగా యువతీ యువకుల సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రజలు సహకరించాలి



అమరచింత ఆత్మకూర్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్

**అమరచింత,మార్చి,25 ప్రభాతవార్త:** అమరచింత, ఆత్మకూరు మున్సిపాలిటీల పరిధిలో ఆస్తి, నల్ల పన్నుల వసూళ్ల సహా ఎల్ఆర్ఎస్ పేమెంట్‌లపై దృష్టి సారించాలని, అదేవిధంగా లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం అమరచింత మున్సిపాలిటీ కార్యాలయంలో ఆత్మకూరు, అమరచింత మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీల పరిధిలో ప్రాపర్టీ, నల్లా పన్నుల వసూళ్ల వేగం పెంచాలని, ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించడానికి వీల్లేదని సూచించారు. బిల్ కలెక్టర్‌లతో పాటు మున్సిపాలిటీలో సిబ్బందిని అందరినీ పన్ను వసుల కోసం కేటాయించి వేగంగా వసూళ్లు చేయాలన్నారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పన్నుల వసూళ్లపై పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పన్ను వసూళ్ల కోసం వెళ్లే సిబ్బంది వద్ద తప్పనిసరిగా అత్యధిక బకాయిలు ఉన్న వారి జాబితా ఉండాలని సూచించారు. బకాయిలు ఉన్నవారికి నోటీసులు పంపించాలని పోస్ట్ ద్వారా, డోర్ టు డోర్ వెళ్లినప్పుడు కూడా నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా, రెండు మున్సిపాలిటీల యొక్క ఆదాయము, ఖర్చులపై కలెక్టర్ సమీక్షించారు.

**ఎల్ఆర్ఎస్ పేమెంట్లపై దృష్టి సారించాలి**

ఎల్ఆర్ఎస్ పేమెంట్లపై మున్సిపల్ కమిషనర్లు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఇదివరకే రూ.1000 కట్టి దరఖాస్తు చేసుకున్న వారు ఎల్ఆర్ఎస్ ఫీజు పేమెంట్ చేసి రెగ్యులరైజ్ చేసుకునే విధంగా వారికి తెలియజేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ ద్వారా ప్లాట్లను క్రమబద్ధీకరించుకోకపోతే అనధికారిక లేఔట్ లపై చర్యలు తప్పవని యజమానులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో అమరచింత మున్సిపల్ కమిషనర్ రవిబాబు, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ శశిధర్ తదితరులు ఉన్నారు.

## మల్దకల్ ఆణిముత్యం నందకుమార్‌కు సన్మానం



నందకుమార్ కు ఘనంగా సన్మానం

**మల్దకల్,మార్చి25 ప్రభాతవార్త:** స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మల్దకల్ నందు మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలకేంద్రానికి చెందిన దామవెంకటేశ్వర్లు,పద్మావతిల కుమారుడు దామనందకుమార్ తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్ 2,3,4 లలో అర్హతసాధించి ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన సందర్భంగా నందకుమార్‌ను, ఎన్నో శ్రమలకోర్చి తన కుమారుడిని ఉన్నత స్థాయికి ఎదిగేవరకు కృషిచేసిన వెంకటేశ్వర్లుని పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బి సురేష్,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందనలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలప్రధానోపాధ్యాయులు సురేష్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు ఇటువంటి విజయాలను స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని, వారి తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని కోరారు. విద్యార్థులు ,మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పినట్లు పాఠశాల స్థాయి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాకారం చేసుకునేలా కృషిచేయాలని ఫలితం దానంతట అదే వస్తుందని నందకుమార్ విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల అంటూ ఏమీ తేడా లేకుండా విజయం వైపు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చురుకుగా అండర్ డ్రైనేజీ నిర్మాణం పనులు

**లింగాల, మార్చి 23 ప్రభాతవార్త:** మండలంలోని అప్పాయిపల్లి గ్రామంలో అండర్ డ్రైనేజీ నిర్మాణం పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. గ్రామస్తుల విన్నపం మేరకు అండర్ డ్రైనేజీ నిర్మాణం పనులకు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ నిధులు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణ, గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో ఎక్కువగా నీరు నిల్వ ఉండి ఇబ్బందులు ఉన్న ప్రాంతాల్లో అండర్ డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఏమి పనులు చేపట్టలేదని, వర్షం వస్తే ఇంటిముందే నీరు నిలువ ఉండేదని ఇప్పుడు అలాంటి సమస్య రాకుండా అండర్ డ్రైనేజీ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి గ్రామానికి అభివృద్ధి చేయడం హర్షణీయం అన్నారు. ఇట్టి పనులను గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, మాజీ ఉపసర్పంచ్ పర్వతాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణ పరిశీలించారు. డ్రైనేజీ పనులను సకాలంలో పూర్తిచేయాలని పంచాయతీ కార్యదర్శి కాంట్రాక్టర్ కు సూచించారు.

## ఉపాధి పనుల పై కూలీలకు అవగాహన

**ఉప్పునుంతల,మార్చి25 ప్రభాతవార్త :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు ప్రభుత్వ అందిస్తున్న రూ.3 వందలు పడాలంటే పనులు చేపట్టాలని మంగళవారం కూలీలకు ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ ఉమాపతి చారి అవగాహన కల్పించారు. మండలంలోని ఉప్పరి పల్లి ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ అవగాహన కల్పిస్తూ ప్రతి కూలికి ప్రభుత్వం అందించే రూ. 3 వందల కూలీ పడాలంటే ఏ పనులు చేపట్టాలని, కూలి చేపట్టిన పనులను పరిశీలించి కొలతల ప్రకారంగా అందించడం జరుగుతుందని. జాబు కార్డు కలిగిన ప్రతి కూలీ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కూలీలకు సూచించారు.

## పీయూ అధ్యాపకురాలికి పిహెచ్‌డీ పట్టా



వీసి శ్రీనివాస్ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న సైదా ఉన్నీసా బేగం

**మహబూబ్‌నగర్,మార్చి25,ప్రభాతవార్త:** పాలమూరు యూనివర్సిటీలో పిజి కాలేజీలో పర్యావరణ శాస్త్ర విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న గాడ్మూర్ జయరాజ్ కోమల్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్డీ పట్టా పొందారు. డాక్టర్ సైదా అజీమ్ ఉన్నిసా పర్యవేక్షణలో ఓయూలో హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో " కారం పొడిని కల్తీ తయారీ విధానం" అనే అంశం పై పీహెచ్డీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపకులపతి ఆచార్య జి ఎన్ శ్రీనివాస్ డాక్టర్ కోమల్ ను అభినందించారు. ప్రతి ఆహార పదార్థాలను కల్తీ చేస్తున్నారని, తద్వారా భవిష్యత్తు తరాలు నష్టపోతున్నాయని, కారంపొడిలో చెక్క పౌడర్, చాక్ పీస్ పౌడర్, కలరింగ్ ఏజెంట్స్ కలపడం మూలంగా కల్తీ అధికంగా జరిగి ప్రజల ఆరోగ్యం పైన పెను దుష్ప్రభావం చూపుతుందని, కల్తీ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు. జయరాజ్ కోమల్ తల్లి దండ్రులు జయరాజ్, సురభివాని. మహబూబ్‌నగర్‌లో ఎస్ఎస్సి, ఇంటర్ న్యూ విజన్ జూనియర్ కాలేజీ, డిగ్రీ, వివేకానంద డిగ్రీ కాలేజీ, పీజీ పీహెచ్డీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేసి, 2018లో సెట్/నెట్‌లో సాధించడం ద్వారా పీహెచ్డీ లో అడ్మిషన్ పొందారు.

## పీయూలో ఉగాది సమ్మేళనం

**మహబూబ్‌నగర్ , మార్చి 25, ప్రభాతవార్త:** పాలమూరు విశ్వవిద్యాలయం, తెలుగు శాఖలో ఘనంగా ఉగాది కవి సమ్మేళనం. తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఉగాది కవితా సమ్మేళనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ నెమ్మికంటి సంధ్యారాణి, పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మన్నెమోని కృష్ణయ్య, తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ బి రవీందర్ గౌడ్, డాక్టర్ జె. తిరుపతయ్య, సిహెచ్ రాఘవేందర్ ప్రారంభించారు. రాజనీతి శాస్త్ర విభాగం సహాయ ఆచార్యుడు డాక్టర్ వంగర భూమయ్య న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి చక్కని కవితాగానం చేసి కవితాపటిమ కనబర్చిన విద్యార్థులను విజేతలుగా నిర్ణయించారు.

## ప్రజల దాహార్తి తీర్చిన
## వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి

**శ్రీరంగాపూర్,మార్చి25 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని గత రెండు నెలలుగా ప్రజలు నీళ్ల చాలక ఇబ్బందులు పడుతున్నారని శ్రీరంగాపురం మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజుకు తెలపగా శ్రీహరి రాజు తక్షణమే స్పందించి వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి ఆదేశాలతో ఎండాకాలం ప్రజలకు నీటి సమస్య రాకూడదని, కొత్త మోటర్‌ను బిగించడం జరిగింది. చెప్పిన వెంటనే స్పందించిన వనపర్తి ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డికి శ్రీరంగపురం మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజుకు బీసీ కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపురం మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజు, మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి జే.ఆశన్న, రాఘవేంద్ర, బుచ్చన్న, కిట్టు, కురుమూర్తి, బాలరాజు బీసీ, బోయ కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల నుండి అప్రమత్తంగా ఉండాలి

◆ ఉట్కూర్ ఎస్సై కృష్ణంరాజు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**ఊట్కూర్, మార్చి 25 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండల కేంద్రంలోని ఎస్సై కృష్ణంరాజు ప్రజలతో మాట్లాడుతూ సైబర్ నేరానికిగురైతే 1930 గుర్తుంచుకోవాలి అపరిచిత వ్యక్తుల నుండి అప్రమత్తంగా ఉండాలని యువకులు బెట్టింగ్‌కు పాల్పడరాదని ఎస్సై కృష్ణంరాజు అన్నారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు ప్రజలకు, యువ కులకు,సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలు, అపరిచిత వ్యక్తుల నుండి అప్రమత్తంగా ఉండాలని, ఐపిఎల్ క్రికెట్ బెట్టింగ్ కు పాల్పడరాదని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఒకవేళ సైబర్ నేరానికి గురైతే టోల్ ఫ్రీ నెంబర్ 1930 లేదా డయల్ 100కి సమాచారం ఇవ్వాలని తెలిపారు. యువకులు ఐపిఎల్‌క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడరాదనిసూచించారు. బెట్టింగ్స్ వల్ల ఆర్థికంగా నష్టపోయి, ఆత్మహత్యలకు దారితీస్తాయని, డబ్బులు లేకపోతే దొంగతనాలకు పాల్పడతారని అలాంటి వాటికి దూరంగా ఉండాలని, తమ పిల్లలు చుట్టుపక్కల వారు బెట్టింగ్‌కు పాల్పడితే పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుండి అప్రమత్తంగా ఉండాలని ఎవరి పైనా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్స్ మహేష్, విజయ్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మల్బరీ పెంపకంతో అధిక ఆదాయం

◆ ఎంపిడివో జయరాం నాయక్


పట్టుపురుగుల మొక్కలను పరిశీలిస్తున్న ఎంపిడిఓ

**నవాబుపేట, మార్చి 25 ప్రభాతవార్త :** మల్బరీ షెడ్లలో పట్టుపురుగులను పెంచడం రైతులకు అధిక ఆదాయాన్ని చేకూరుస్తాయని ఎంపిడివో జయరాం నాయక్ అన్నారు. మండల పరిధిలోని పురుషంపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు పరిష్కరించిన అనంతరం పట్టుపురుగుల మొక్కలను పరిశీలించారు. ఎంపీడీవో పట్టుపురుగుల పెంపకం ద్వారా రైతులకు ప్రతినెల ఆదాయం అందించే పట్టుపురుగుల పెంపకం పై రైతులు దృష్టి సారించాలని సంప్రదాయ పంటలతో ఏటా నష్టపోతున్న అన్నదాతలకు పట్టు పరిశ్రమ వరంగా మారిందని ఈ సందర్భంగా తెలియజేశారు. నిత్యం శ్రమ చేసే చిన్న సన్నకారు రైతులకు ఈ పరిశ్రమ మరింత అనుకూలంగా ఉంటుందని పట్టుపురుగుల పెంపకంలో తక్కువ పెట్టుబడితో ఏడాదంతా పంటలను తీసుకునే వెసులుబాటు ఉండటంతో రైతులు వీటి పెంపకం వైపు మొగ్గు చూపాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయరాం నాయక్‌తో పాటు ఎంపీఓ బద్రి నాయక్, ఏపీఓ జ్యోతి, టిపి హనుమాన్ సింగ్, ఎఫ్ఎఅశ్విన్, సెరికల్చర్ గోపాల్, ఎంఎన్ఆర్ ఇజిఎస్ ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.

## వంద పడకల ఆసుపత్రి ఎదుట బిజెపి నాయకుల ధర్నా

**అలంపూర్, మార్చి 25 ప్రభాతవార్త :** గద్వాల్ జిల్లా ఉండవల్లి మండలం అల్లంపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసినటువంటి వంద పడకల ఆసుపత్రి ముందు బిజెపి నాయకులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా బిజెపి మాజీఅధ్యక్షులు నాయకులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ దాదాపు రూ.30 కోట్లతో నూతన హాస్పిటల్ ఏర్పాటుచేసి ప్రారంభిస్తే నేటి వరకు నిరుపయోగంగా ఉందని రోగులకు ఎలాంటి వైద్య సేవలు లేవని మండిపడ్డారు. జాతీయ రహదారిపై ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకుని సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్న ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన అలంపూర్ పై పాలకులు నిర్లక్ష్యం వీడి వెంటనే హాస్పిటల్ లో వైద్య సేవలు ప్రారంభించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. 100 పడకల హాస్పిటల్ పై స్థానిక ఎంపీ ఎమ్మెల్యే ఎమ్మెల్సీ చొరవ తీసుకొని ఏప్రిల్ 15లోపు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి రాజగోపాల్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్ శర్మ, మండల నాయకులు నాగేశ్వర్ రెడ్డి, పిడుగు వెంకటేష్, గొంగళ్ళ ఈశ్వర్, మురళీకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

## డా.బీఆర్ఆర్ కళాశాలలో సీపీఆర్‌పై అవగాహన

**జడ్చర్ల,మార్చి 25, ప్రభాతవార్త:** డాక్టర్. బి.ఆర్. ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఫస్ట్ ఎయిడ్ సి.పీ.ఆర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుకన్య మాట్లాడుతూ సి.పీ.ఆర్.పై ప్రతి విద్యార్థిని, విద్యార్థులు అవగాహన కలిగివుండాలి అని, దాని వల్ల ఎంతోమంది ప్రాణాలను మనం కాపాడు కోవచ్చన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్.నటరాజ్ మాట్లాడుతూ ప్రస్తుతం గుండెకు సంబంధించిన వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయని,వాటిని అవగాహన కల్పించుటకు మాస్టర్ ట్రైనర్ బాబుల్ రెడ్డి శిక్షణ ఇస్తారని ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నర్మదా ,అలుమిని సభ్యుడు కాల్వ రామిరెడ్డి, రెడ్ క్రాస్ మేనేజర్ నరసింహ. యన్.యస్ యస్ ప్రోగ్రాంఅధికారులు ప్రవీణ్ కుమార్,మాధురి, నంద కిషోర్ ఉమెన్ ఎంపవర్మెంట్ పుష్పలత,అధ్యాపకులు రాఘవేంద్రరెడ్డి,సురయ్య జబీన్,రాజేశ్వరి,నరసింహ రావు, నరస్నేహులు, వెంకటేశ్వర్లు,విద్యార్థులు లక్ష్మణ్ గౌడ్ ,కీర్తన, అనుష,శిరీషతోపాటు 500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు

## విత్తన ప్రాసెసింగ్ యూనిట్లలో విస్తృత తనిఖీలు

**భూత్పూర్,మార్చి 25,ప్రభాతవార్త:** భూత్పూర్ పట్టణ,రూరల్ ప్రాంతాల్లోని సాయి భవ్య సీడ్స్,సుదివ్య సీడ్స్ ప్రాసెసింగ్ యూనట్లలో మంగళవారం వ్యవసాయాధికారుల బృందం విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించారు. బృందం సభ్యులు ఆయా యూనిట్లలోని ప్రాసెసింగ్ రిజిష్టర్లు,స్టాక్ రిజిష్టర్లు,డీపీలు,లైసెన్స్ లు,టీసీలు,స్టాక్ నిల్వల రిజిష్టర్లను తనిఖీ నిర్వహించడంతో పాటు హెచ్‌టి టెప్టులు నిర్వహించారు. యానిట్లలో ఎటువంటి బీటీ3 నిల్వలు కనుగొనబడలేదని అధికారుల బృందం తేల్చారు. ఈతనిఖీ బృందంలో వ్యవసాయాధికారులు బ్యూలా,అంజనేయులుగౌడ్, మురళిధర్,యశ్వంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రివర్గంలో ముస్లింలకు స్థానం కల్పించాలి

**భూత్పూర్,మార్చి 25,ప్రభాతవార్త :** రాష్ట్ర మంత్రివర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి ముస్లింలకు అవకాశం కల్పించాలని ఆల్‌ఫైజ్ ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు జహంగీర్‌బాబా అన్నారు. మంగళవారం ఆయన భూత్పూర్‌లో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడంలో ముస్లింలు ప్రధాన భూమికను పోషించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 44లక్షల 57వేల012 జనాభాతో రాష్ట్ర జనాభాలో 12.56శాతం ఉన్న ముస్లింలకు మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వినూత్న పథకాలతో సంక్షేమ రాష్ట్రంగా మారుస్తోందన్నారు. రాష్ట్రంలో బీసీ,ఎస్సీ,ఎస్టీ కులగణన చేపట్టడం హర్షింపతగ్గ అంశమని అన్నారు. త్వరలో జరిగే మంత్రి వర్గ విస్తరణలో ముస్లింలకు స్థానం కల్పించానలి జహంగీర్‌బాబా సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

## స్వయం ఉపాధికై దరఖాస్తులు

**చిన్న చింతకుంట, మార్చి 25 ప్రభాతవార్త:** స్వయం ఉపాధికై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా యువతీ యువకులకు బ్యాంకు రుణాలను అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగామండలంలోని ఆయా గ్రామాల యువతీ, యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు పత్రాలతో పాటు కులము, ఆదాయం ,విద్యార్హత తోపాటు మిగతా ధ్రువపత్రాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని ఎంపీడీవో సుధాకర్ రెడ్డి మంగళవారం తెలిపారు.

## గ్రామాలలో సమస్యలు పరిష్కరించాలని వినతి

**అడ్డాకుల, మార్చి25 ప్రభాతవార్త:** మండల పరిధిలోని గ్రామాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కెవిపిఎస్,ఎస్ఎఫ్ఐ,ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మండల కార్యాలయం ముందు కెవిపిఎస్ మండల కార్యదర్శి బాలరాజు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా ఉద్దేశించి కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మల్లెల మాణిక్యం రాజు, ఎం.కుర్మయ్య మాట్లాడుతూ మండలంలోని బలీదు పల్లి గ్రామంలో గత ఆరు నెలల నుంచి ఎస్సీ కాలనీ వీధిలైట్లు లేక దళితులు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు. గుడిబండ, తిమ్మాయిపల్లి గ్రామాల్లో దళితులు సాగు చేసుకుంటున్న భూములను అగ్రకుల పెత్తందారులు ఆక్రమించుకొని దౌర్జన్యంగా పట్టాలు చేసుకున్నారు పట్టాలు రద్దు చేయాలని వాళ్ళు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వివిధ గ్రామాలలో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు వేయాలని వారు కోరారు. మండలంలోని అన్ని గ్రామాలలో దళితులకు ఇందిరమ్మ ఇండ్ల కోసం వందలాదిమంది అప్లై చేసుకున్నారు. కానీ గ్రామాలలో అధికార పార్టీ నాయకులు ఒకరిద్దరికే ఇల్లు వస్తాయి మిగతా వారికి రావని చెప్తున్నారు. ఇది సరైనది కాదని దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్లో మహనీయుల జయంతుల సందర్భంగా గ్రామాల్లో అంటరాంతనపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ కె. శేఖర్ కు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్షులు, ప్రసాద్,ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ప్రశాంత్, నాయకులు నాగవర్ధన్, ఆంజనేయులు,నరసింహ, కుమార్,నరేందర్, నాగరాజు రాజేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో లక్ష్మి చెన్నకేశవ స్వామి మండల పూజలు


హోమం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

**బిజినేపల్లి, మార్చి25 ప్రభాతవార్త:** నంది వడ్డేమాన్ శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయంలో మంగళవారం మండల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు సముద్రాల శ్రీమన్నారాయణచే శాస్త్రోక్తంగా మండల పూజా మహోత్సవంలో దేశ వ్యాప్తంగా వివిధ పుణ్యనదుల నుండి సేకరించిన పవిత్ర జలాలతో శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి వారికి అభిషేకం చేశారు. పవిత్ర జలాలతో స్వామివారికి అభిషేకం చేస్తుండగా ఆలయ ప్రాంగణం జై చెన్నకేశవ, జైశ్రీ మన్నారాయణ నామస్మరణతో మార్మోగింది. భక్తులకు ఫిబ్రవరిలోవారం రోజులపాటు విజయవంతంగా నిర్వహించబడిన ప్రాణప్రతిష్ఠా మహోత్సవాల తరువాత, ఈ మండల పూజలు శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి దివ్య అనుగ్రహాన్ని పొందే మరొక అపూర్వ అవకాశం భక్తులకు లభించింది. 108 కళశాలతో జరిగిన ఈ అభిషేకం అత్యంత విశిష్టమైన పుణ్యఫలాలను అందిస్తుందని అర్చకులు తెలిపారు. పూజా కార్యక్రమాలు ఆశేషం శాస్త్రోక్తంగా నిర్వహించడంతో ఉమ్మడి జిల్లా నుంచి పూజలకు హాజరైన భక్తులు చెన్నకేశవస్వామివారి సేవలో తరించారు. అనంతరం స్వామివారి ప్రతిష్ఠ మహోత్సవంతో పాటు, విశేష సేవలు అందించిన భక్తులను ఈ సందర్భంగా సన్మానించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తిప్పి రెడ్డి నందకిషోర్‌రెడ్డి, శ్రీకృష్ణమాచార్యులు, కేశవయ్య, నర్సింహులు, తిప్పి రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రేవల్లి వెంకటరెడ్డి, ఎస్.శేఖర్, టి.సదానందం, తిప్పిరెడ్డి, రాంరెడ్డి, ఆవుల రాములు, ప్రభాకర్ ఆచారి చిదర శంకర్, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, వేముల భూపతి తదితరులు పాల్గొన్నారు.

## ధన్వాడలో షాపింగ్ కాంప్లెక్స్ వేలంపై గందరగోళం

■ వాయిదా పడ్డ షాపింగ్ కాంప్లెక్స్ వేలం


అధికారులతో వాగ్వాదానికి దిగిన వ్యాపారులు

**ధన్వాడ, మార్చి25 ప్రభాతవార్త :** ధన్వాడలో ఐదు రోజులపాటు కొనసాగిన గ్రామపంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ వేలం పాట విషయమై ఉత్కంఠకుతెరపడింది. ప్రస్తుతం షాపింగ్ కాంప్లెక్స్‌లో కిరాయి ఉన్న దుకాణదారులు వేలం వాయిదా వేయాలని అధికారులతో గొడవకు దిగారు. అభ్యంతరాలు వాగ్వి పాదాల మధ్య ఏట్టకేలకు వేలం పాట వాయిదా పడింది. ఎంపీడీవో సాయి ప్రకాష్, ఎంపిడివో వెంకటేశ్వర రెడ్డి, గ్రామ కార్యదర్శి శ్రీనివాస రావులు గ్రామపంచాయతీ కాంప్లెక్స్ దుకాణాల వేలంపాటకు సిద్ధమయ్యారు. అయితే ప్రస్తుతం ఉన్నదుకాణా దారుల యజమానులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. వేలం వేసి మా బతుకుల పై మట్టి కొడతారా అంటూ దుకాణదారులు ఆందోళన వ్యక్తం చేశారు. వేలంపాట ప్రారంభం కన్న ముందు నుంచే దుకాణదారులు గ్రామపంచాయతీకి చేరుకొని వేలం పాటలు వాయిదా వేయాలంటూ డిమాండ్ చేస్తూ వచ్చారు.. అదే సమ యంలో వేలంపాటకుబందోబస్తు వచ్చిన ఎస్సైరమేష్ దుకాణదా రులతో మాట్లాడారు. వేలంపాటను వాయిదా వేయాలంటే పై అధికారుల దృష్టికి తీసుకుపోవాలంటూ ఎస్సై దుకాణదారులను కోరారు. మూడు రోజులపాటు ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి వద్దకు వెళ్లి మా సమస్యను విన్నవించడం జరిగిందని దుకాణదారులు ఎస్సైతో చెప్పుకొచ్చారు. మీరు వెళ్ళండి మీకు సరైన న్యాయం చేస్తానని ఎమ్మెల్యే చెప్పడంతోనే మేము కలెక్టర్‌ను కలవలేదని దుకాణదారులు వాపోయారు. కాగా పంచాయతీ కార్యాలయంలో షాపింగ్ కాంప్లెక్స్ నువేలం వేయడానికిఅధికారులు సిద్ధమవు తున్న తరుణంలో వాగ్వావాదం చోటుచేసుకుంది. వేలంపాట సమయంలో దుకాణదారులు లొల్లి లొల్లి చేశారు. వేలంపాటలు రద్దు చేయాలని దుకాణదారులతోపాటు బిజెపికి చెందిన కొంత మంది నాయకులు అధికారులతో పట్టుపట్టారు. కొంత గడువు ఇవ్వాలని తర్వాత వేలం వేయాలంటూ పట్టు పట్టారు. జిల్లా అధికారుల అనుమతి తీసుకొని వేలంను వాయిదా వేయాలని పట్టుపట్టారు. చేసేది లేక అధికారులు షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాల వేలంను వాయిదా వేశారు. అదే విధంగా కాంగ్రెస్ నాయకులు సైతం వేలం వాయిదా వేసి వేలకు కొంత గడువు ఇవ్వా లని అధికారులకు వినతి పత్రం అందించారు. వేలం వాయిదా వేస్తున్నామని అధికారుల ఇలా చెప్పారో లేదో వేలం వేయడానికి వచ్చినవారి నుంచి అధికారులకు నిరసన ఎదురయ్యింది. మేము డిపాజిట్ చేశాం...షాపులు ఎందుకు వేలం వెయ్యారు, మరి డిపాజిట్ డబ్బులు ఎందుకు తీసుకున్నారు అంటు అధికారులతో గొడవకు దిగారు. ఇలా షాపులు వేలం వేయాలని కొంత మంది, లేదు షాపులు వేలం వేసేది లేదంటూమరి కొంత మంది డిమాండ్ చేయడంతో అధికారులకు రెండు వైపులా నుంచి నిరసన ఎదురు అయ్యింది. ఏం చేయాలో అధికారులకు పాలు పోక ఎట్టకేలకు షాపింగ్ కాంప్లెక్స్ వేలం పాట వాయిదా వేశారు. మళ్ళీ వేలం పాట తేదీని ప్రకటిస్తామని చెప్పుకొచ్చారు. కాగా పంచాయతీకార్యాలయంలో అంతకు ముందు తైబజార్ వేలం వేశారు. తైబజార్ వేలం పాటలో ధ్యవారి రాజు రెండు లక్షల 75 వెలకు తై బజార్ దక్కించుకున్నారు.రాజు 10 వ సారి వేలంను దక్కించుకున్నారు.

## గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి


వెంకటేష్ నాయుడు, పంచాయతీ సెక్రటరీ (ఫైల్)

**అలంపూర్, మార్చి 25 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడుమండల కేంద్రానికి చెందిన వెంకటేష్ నాయుడు (పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్1) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. గత బిఆర్ఎస్ పరిపాలనలో జీ.ఓ 317 క్రింద నిజామాబాద్ జిల్లా ఇందులవాయి మండలంలో, గన్నారం గ్రామ పంచాయితీకిపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందారు. అతనికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

**తనదైన శైలిలో కొనసాగిన సెక్రటరీ:** పంచాయతీ సెక్రెటరీగా విధులు నిర్వహిస్తున్న వెంకటేష్ నాయుడు ఇటిక్యాల మండలంలోని శాసనూల్, షేక్‌పల్లి, పుటాన్ దొడ్డి, గ్రామంలో గతంలో పంచాయతీసెక్రటరీగావిధులు నిర్వహిస్తూ గ్రామస్తులతో మంచిగా మెలిగారు. సమస్య ఉందని తన దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్కరికి ఒక అధికారిక సహాయం చేస్తూ ప్రజల్లో మన్ననలు పొందారు. సెక్రెటరీ మరణాన్ని ఆయా గ్రామాల్లోని గ్రామస్తులు జీర్ణించుకోలేకఆవేదన చెందారు. ఎల్లప్పుడూ ప్రజలతో మమేకమై విధులు నిర్వహించే వారని ఆయా గ్రామాల ప్రజలు గుర్తు చేసుకున్నారు.

## గుడుంబా స్థావరాలపై దాడి చేసిన ఎక్సైజ్ అధికారులు



దాడులు నిర్వహించి బెల్లం ఊటను పారబోస్తున్న దృశ్యం

**మద్దూర్, మార్చి25ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మంగళవారం కోస్గి ఎక్సైజ్ అధికారులు పలు తండాల్లో దాడులు నిర్వహించారు. ఈనెల 23వ తేదీ రోజు గుప్పుమంటున్న గుడుంబా సారాయి పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు అనే శీర్షికపై వార్త రావడంతో అధికారులు స్పందించి దాడులు నిర్వహించారు. ఉమ్మడి మద్దూరు మండల పరిధిలోని గోకుల్ నగర్, వాల్యా నాయక్ తండా, మేడికుంట తండా దాడులు నిర్వహించగా 80 లీటర్ల సారాయి, బెల్లం తదితర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై జబ్బర్ తెలిపారు. పలువురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో మౌలిక వసతులు

**రాజాపూర్,మార్చి25 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తుందని రంగారెడ్డి గూడ మాజీ సర్పంచ్, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాతృమూర్తి జనంపల్లి శశికళా రెడ్డి అన్నారు. మంగళవారం రాజాపూర్ మండలం గుండ్ల పొట్లపల్లి గ్రామంలోని శివాలయం వద్ద 450 మీటర్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సిసి రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకై స్థానిక శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి కృషితో సిసి రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువలు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్టు ఆమె తెలిపారు. ఆమె వెంట పలువురు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## శాంతి భద్రతలపై దృష్టి పెట్టండి

● జిల్లా డిఎస్పి వెంకటేశ్వర్లు


విలేఖరులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

**చిన్నచింతకుంట, మార్చి 25 ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాలలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా డిఎస్పి వెంకటేశ్వర్లు ఆదేశించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. స్టేషన్ లోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఫిర్యాదుదారుల పట్ల ఫ్రెండ్లీ పోలీసింగ్ పాటిస్తూ వారి ఫిర్యాదులను సానుకూలంగా స్పందిస్తూ పరిష్కరించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలను యువత తీరుపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలై తన విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. సీసీ కెమెరాల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. డిఎస్పి వెంట భూత్పూర్ సీఐ రామకృష్ణ, స్థానిక ఎస్సై రాంలాల్ నాయక్, ట్రైనింగ్ ఎస్సై భాస్కర్, ఏఎస్ఐ వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

## బాల మేధావిని సన్మానించిన ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

**ఉప్పునుంతల, మార్చి 25 ప్రభాతవార్త:** సౌరశక్తితో నడిచే సైకిల్‌ను ఆవిష్కరించిన బాల మేధావిని మంగళవారం మండల ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామానికి చెందిన పాపి శెట్టి కల్పన, మధుసూధన్ తనయుడు పాపిశెట్టి సుప్రీత్ మైల్ స్టోన్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. సుప్రీత్ చిన్నప్పటి నుంచి మంచి ప్రతిభాగల విద్యార్థిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. అందులో భాగంగా సౌరశక్తితో సైకిల్ నడిచే విధంగా తయారు చేసి అందరినీ అబ్బుర పరిచారు. ఇటీవల కొల్లాపూర్ ప్రాంతానికి చెందిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు బండి వెంకట రెడ్డి సన్మానించి నగదు ప్రోత్సాహకం అందించారు. అదే విధంగా మండల కేంద్రంలోని ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు శాలువాలుకప్పి ఘనంగా సన్మానించారు. బహుమతి అందజేశారు. పాఠశాల సిబ్బంది బాల మేధావి తాత పాపిశెట్టి బాల్‌చంద్రయ్య,గుణ సుందరమ్మను, ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు పాపి శెట్టి కల్పన, మధు సూధన్ తనయుడు పాపి శెట్టి సుప్రీత్‌ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు బంధం మనోహర్, బిల్లకంటి రవీ కుమార్, దాచేపల్లి సాయిరాం, కర్నాకర్, బంధం బాలకృష్ణ, దొంతు కుమార్‌స్వామి, పాపి శెట్టి కిషన్, ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఉన్ని కృష్ణ న్, పొన్నగంటి దేవేందర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాపిశెట్టి సుప్రీత్‌ను సన్మానిస్తున్న వైశ్య సంఘం ప్రతినిధులు

## పాలెం వెంకన్న హుండీ లెక్కింపు

**బిజినేపల్లి, మార్చి25 ప్రభాతవార్త:** పాలెం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ హుండీని మంగళవారం దేవదాయ శాఖ జిల్లా అధికారి వేంకటేశ్వరి ఆధ్వర్యంలో లెక్కించారు. భక్తుల కానుకల రూపంలో 3 లక్షల 17వేల 864రూపాయలు, 35 గ్రాముల బంగారం స్వామి వారికి ముడుపులు, కానుకలు సమర్పించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్. రంగరావు తెలిపారు. హుండీ లెక్కింపులో చైర్మన్ మనుసాని విష్ణుమూర్తి,ఆలయ ప్రధాన అర్చకులు కురవి రామానుజాచార్యులు, జయంత్,శుక్లా, చక్రపాణి, మాజీఎంపిటిసి జగన్ మోహన్, లక్ష్మినారాయణరెడ్డి,ఆలయ సిబ్బంది ఆర్.శివకుమార్, బాబయ్య,శ్రీవారి సేవకులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


హుండీ లెక్కిస్తున్న అధికారులు

## నేడు ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

**కల్వకుర్తి, మార్చి 25 ప్రభాతవార్త:** ప్రతి సంవత్సరం రంజాన్ మాసంలో ముస్లిం సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తున్నామని,అదే విధంగా బుధవారం కల్వకుర్తి పట్టణంలోని అబుబకర్ ఫంక్షన్ హాల్‌లో సాయంత్రం 6 గంటలకు నియోజకవర్గం ముస్లిం సోదరులకు ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఇఫ్తార్ విందు కార్యక్రమంలో నియోజకవర్గ ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యేకసిరెడ్డి నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఉరి వేసుకుని బీహార్ రాష్ట్రానికి చెందిన యువకుడి మృతి

**వెల్దండ, మార్చి 25 ప్రభాతవార్త:** వెల్దండ మండలం రాచూరు గ్రామంలో ఉన్న వింటేజ్ కాఫీ కంపెనీలో పని చేయడానికి 20 రోజుల క్రితం వచ్చిన బీహార్ రాష్ట్రనికి చెందిన మోహిత్ కుమార్ (21)సోమవారం రాత్రి ఉరి వేసుకుని మృతి చెందాడు. వివరాలకు వెళితే కాఫీ కంపెనీలో పని చేయడానికి బీహార్ రాష్ట్రం ఔరంగాబాద్ జిల్లా కస్తూరిపురికి చెందిన మోహిత్ కుమార్ 20 రోజుల క్రితం పనికి వచ్చి మూడు రోజుల నుండి పనికి పోకుండా ఉన్నాడని, సోమవారంరాత్రి ఇద్దరు స్నేహితులు లోపల గదిలో నిద్రించగా గది బయట నుంచి గడియ పెట్టి ఆరుబయట నిద్రిస్తున్న మోహిత్ కుమార్ కొద్ది దూరంలో ఉన్న వ్యవసాయ పొలంలోని షెడ్డులో ఉరి వేసుకుని మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని సీఐ విష్ణు వర్ధన్ రెడ్డి చేరుకొని పరిశీలించి మృతదేహన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుగుతున్నట్లు సీఐ వెల్లడించారు. మృతునికి వివాహం కాలేదని తోటి కార్మికులు తెలిపారు

## నేడు ఎమ్మెల్యే చేతుల మీద కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ

**వెల్దండ, మార్చి25 ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్న మండల తహసిల్దార్ కార్తీక్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 3.00గంటలకు కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందిస్తున్నట్లు లబ్ధిదారులు తప్పకుండా హాజరై చెక్కులను అందుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

**గద్వాల, మార్చి25 ప్రభాతవార్త:** తుమ్మల చెరువు ప్రాథమికోన్నత పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి నల్లారెడ్డి పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజన్న కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. మండల విద్యాధికారి మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని అది సాధించేవరకు కష్టపడిఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తమ తల్లిదండ్రులు వారిపై పెట్టుకున్న నమ్మకాన్ని అనుకున్న లక్ష్యాలను సాధించాలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు రాజన్న మాట్లాడుతూ క్రమం తప్పకుండా పాఠశాలకు రావడం వల్ల ఉపాధ్యాయులు బోధించే విషయాలను నేర్చుకొని అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చు అని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తుమ్మల చెరువు పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్లను తనిఖీ చేసిన తహసీల్దార్

**మద్దూర్, మార్చి 25 ప్రభాతవార్త :** మద్దూరు మండల పరిధిలోని దుప్పడి గట్టు శివారులో మంగళవారం కొత్తపల్లి మండల తాహశీల్దార్ ఆకస్మికంగా ఇసుక ట్రాక్టర్లను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆన్‌లైన్ ద్వారా ఎస్ఎంఎస్ పొందిన ట్రాక్టర్లు మాత్రమే ఇసుకను ఇతర ప్రాంతాలు తొలగించే అవకాశం ఉంటుందని, రాజకీయ మధ్యవర్తుల ప్రమేయంతో అక్కడక్కడ కొన్ని తప్పిదాల వల్ల సమస్యలు తలెత్తడం వల్ల ఎప్పటికప్పుడు జిల్లా అధికార ఆదేశాల మేరకు తనిఖీ చేయడం జరుగుతుందని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే ఇసుక రవాణా కొనసాగుతుంది. కావున ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎటువంటి పనులు చేపట్టిన చట్టరిత్యా చర్య తీసుకోబడుతుందని ఈ సందర్భంగా తాహశీల్దార్ జయరాములు అన్నారు. టాక్టర్ల యజమానులు ప్రభుత్వం ప్రతి రసీదు ఉంచుకొని డ్రైవింగ్ లైసెన్స్, రోడ్ టాక్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్, వంటి వాటిని ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. 18 సంవత్సరాల పైబడిన వ్యక్తులే డ్రైవర్‌గా కొనసాగాలని సూచించారు. ఎలాంటి వారైనా తప్పిదాలను చేస్తే చట్టరిత్య చర్య తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తుగా వివోఏల అరెస్టు

**ఇటిక్యాల, మార్చి25 ప్రభాతవార్త:** వివోఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చలో హైదరాబాద్‌కు పిలుపుఇవ్వగా అందులో భాగంగా మంగళవారం తెల్లవారు జామున చిట్యాల పోలీసులు హైదరాబాద్‌కు వెళ్లకుండా వివోఏలను ముందస్తుగా అరెస్టు చేసినట్లు అనంతరం విడుదల చేసినట్లు వివోఏల సంఘం జిల్లా అధ్యక్షులుశివశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని. ప్రభుత్వ హామీ మేరకు వివోఏలకు రూ. 20వేల కనీస వేతనం ఇవ్వాలని 20 లక్షల బీమా సౌకర్యం ఆరోగ్య బీమా సౌకర్యం బకాయి శ్రీనిధి ఇన్సెంటివ్ ఇవ్వాలని ప్రభుత్వం వివోఏలకు ప్రతినెల వేతనాలను వ్యక్తిగత అకౌంట్లో జమ చేయాలని అలాగే ప్రభుత్వం జీవో ప్రకారం గ్రామ సంఘం నుండి రూ.3 వేల ఇప్పించాలని ప్రతి గ్రామ సంఘానికి ట్యాబు నెట్ సౌకర్యం కల్పించాలని ఇంకా పలు డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరెస్టు అయినవారిలో వివోఏలుశివశంకర్, హనుమంతు, ఏసన్న, శారదమ్మ, మద్దమ్మ, జయలక్ష్మి, సరస్వతి, రాధమ్మ వీరితో పాటు మరో 7 మంది వివోఏలు ఉన్నారు.

### గద్వాల పట్టణంలో పురాతన కట్టడాలను పరిరక్షించాలని

## అఖిల పక్షం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**గద్వాల, మార్చి 25 ప్రభాతవార్త:** గద్వాల పట్టణంలో పురాతన కట్టడాలు పరిరక్షించాలని అఖిల పక్షం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గద్వాల పట్టణంలోని అతి పురాతనమైన కట్టడాలలో కొత్త బావి ఒకటని దానిని పరిరక్షించాలని అఖిల పక్షం నాయకులు కోరారు. తెలంగాణలోని అనేక సంస్థానాలలో అతి బలమైన సంస్థానం గద్వాల అని అన్నారు. మట్టి తో నిర్మించిన 50 అడుగుల ఎత్తు కలిగిన కోటలో చెన్నకేశవ దేవాలయం ఎంతో సుందరంగా ఉందన్నారు. అనేక కళాభవనాలు, అపురూపమైన శిల్ప సంపదతో కూడుకున్న దేవాలయాలు గద్వాల సంస్థానంలో ఉన్నాయన్నారు.నాడు ప్రజల దాహార్తిని తీర్చడానికిఎన్నో బావులు తవ్వించి ప్రజలకు అందించారన్నారు. బావులలోనే సెద తీర్చడానికి, మండపాలు, స్నానం చేయడానికి గదులు, చుట్టూ రాతి కట్టడాలు, ఎటుచూసినా మెట్లు, అందమైన గోడలు, బావులలోనే దేవాలయాలు నిర్మించారు. ఇటువంటిబావులు దేశంలోనే తక్కువగా ఉంటాయన్నారు.గద్వాల పట్టణ ప్రజలు, వివిధ సంఘాల నాయకులు గత నెల రోజులుగా అధికారులకు, కలెక్టర్లకు మున్సిపల్ అధికారులకు, విన్నవించడం జరిగిందన్నారు. అయినా భయం లేకుండా మరింత దూకుడుగా మట్టిని పోసి పూడ్చాలని చేసిన ప్రయత్నాలను నిరసిస్తూ మంగళవారం గద్వాల పురాతన కట్టడాల పరిరక్షణ సమితి, సీనియర్ సిటిజన్ ఫోరం, అఖిలపక్ష కమిటీ, ప్రజాసంఘాలు, ప్రాచీన కట్టడాల పరిరక్షణ సమితి, వివిధ రాజకీయ పార్టీల, కార్మికసంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ నుండి ర్యాలీ తీసి పాత బస్టాండ్లో సభ నిర్వహించారు. వెంటనే మాజీ మున్సిపల్ చైర్మన్ కొత్త బావిని పునరుద్ధరించాలని, పునరుద్ధరించకపోతే క్షమించే ప్రసక్తే లేదన్నారు. ఆక్రమించుకున్న వేణుగోపాల్ పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరుతూ వివిధ సంఘాల నాయకులు, వక్తలు,తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కోటీశ్వరుడైన వేణుగోపాల్ ఏమి తక్కువైందని తాయమ్మ గుడిని, కొత్త బావిని ఆక్రమించుకున్నాడని ప్రశ్నించారు. సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు మోహన్ రావు అధ్యక్షత వహించగా తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర నాయకులు శంకర్ ప్రభాకర్, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకట రాములు, కాంగ్రెస్ జిల్లా నాయకులు అడ్వకేట్ మధుసూదన్ బాబు,సిపిఎం జిల్లా కార్యదర్శివెంకటస్వామి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, సిపిఎం జిల్లా నాయకులు నరసింహ,ఏపీసిఎల్సి జిల్లా నాయకుడు సుభాన్, జిల్లా దళిత సంఘాల నాయకుడు మోహన్, అడ్వకేట్ శ్యామ్, షఫీ ఉల్ల, టిఆర్ఎస్వి జిల్లా కోఆర్డినేటర్ కురువపల్లయ్య, బహుజన రాజ్యసమితి నాయకులు వినోద్, వాల్మీకి, హుస్సేన్, సిపిఐ నాయకులు రంగన్న, రైతాంగ సమితి నాయకులు గోపాల్, జక్కుల వెంకటయ్య, టిఆర్ఎస్ నాయకులు పిడిఎస్‌యు రాజు, శ్రీరాము, సాదిక్ ప్రజాసంఘాల నాయకులు నాగన్న కళాకారులు, రిక్షా కార్మికులు వివిధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన సభను విజయవంతం చేశారు.

## ఆశాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరి నశించాలి

### ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు చెల్లించాలి : సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జి. వెంకట్రాంరెడ్డి

**ఉట్కూరు, మార్చి 25 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పులిమామిడి గ్రామంలో ఆశ వర్కర్ల నిరసన కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సోమవారం కమిషనరేట్ ముందు ధర్నా కార్యక్రమానికి వెళ్లిన ఆశాలపట్ల నిర్బంధాన్ని ప్రయోగించడం కాకుండా అనేకమందిగాయాల పాలయ్యారు.ఆశాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పులి మామిడి గ్రామంలో పిహెచ్‌సి పరిధిలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమానికి పిఎస్సి అధ్యక్షురాలు పద్మమ్మ అధ్యక్షత వహించగా ఈ ధర్నాను ఉద్దేశించి మాట్లాడిన సిటియు జిల్లా అధ్యక్షులు రాష్ట్ర ప్రభుత్వం ఆశాలపట్ల నిర్లక్ష్య వైఖరిని విడనాడి వాళ్ల సమస్యల పరిష్కారం కొరకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఆశాలు కొత్తగా ఏమీ కోరడం లేదని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఫిక్స్‌డ్ వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని పిఎఫ్,ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలనిపెన్షన్స్ సౌకర్యం కల్పించాలని,రిటైర్మెంట్ బెనిఫిట్ అయిదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయ కులు శివగౌడ్ మాట్లాడుతూ ఆశాలు చేస్తున్న పోరాటానికి తెలంగాణ రైతు సంఘం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని మీ పోరాటాల్లో మేము భాగస్వాములమవుతామని తెలియజేశారు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పరాదని వేతనాలు వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జైనాబి,ఆషాభి, సంతోష,రేణుక,పద్మ, సంధ్యారాణి, మణెమ్మ, చెన్నమ్మ, సావిత్రి, బాలమ్మ, పద్మ, అనురాధ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌కు సిఐటియు నాయకుల వినతి

**నారాయణపేట టౌన్, మార్చి25 ప్రభాతవార్త:** నారాయణపేట మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న స్వచ్ఛ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సిఐటియు నాయకుల ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ భోగేశ్వరరావుకు వినతి పత్రంఅందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కార్మికులు ఎదుర్కుంటున్న పలు సమస్యలుకమిషనర్‌కు తెలియజేసారు. గత మూడు నాలుగు సంవత్సరాలుగా చెత్త సేకరించే ఆటో డ్రైవర్లు గా,పార్కు ,డివైడర్ మొక్కలసంరక్షణ కార్మికులుగా పనిచేస్తున్న 20మంది స్వచ్ఛ కార్మికులకు కనీస వేతనం కాంట్రాక్టర్ చెల్లించడం లేదని, పీఎఫ్ అమౌంటు కార్మికుల ఖాతాల్లో రెగ్యులర్గా జమ చేయట్లేదని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంటాక్ట్ ,ఔట్సోర్సింగ్ కార్మికుల వలె స్వచ్ఛ కార్మికుల కూడా యూనిఫార్మ్స్,సబ్బు నూనెలు తదితర ప్రభుత్వ నుండి అందే సౌకర్యాలను అందించాలని కోరారు. మరణించిన కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగ కార్మికునికి కుటుంబంలో వారసులు లేనిచో ఆ స్థానంలో బయటి వారికి ఇవ్వకుండా స్వచ్ఛ కార్మికులకు అవకాశం కల్పించాలని, స్వచ్ఛ కార్మికులకు సొసైటీలను ఏర్పాటు చేసిథర్డ్ పార్టీ కాంట్రాక్టర్ నుండి విముక్తి కల్పించాలని కోరారు.తన పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని తన పరిధిలో లేని సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకొని పోతానని కమిషనర్ తెలియజేశారు. ఈ వినతిపత్రం అందించిన వారిలో బాలు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ తీరును ఖండిస్తూ "ఆశా"ల నిరసన

**పానుగల్, మార్చి 25 ప్రభాతవార్త :** ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళలు అని కూడా చూడకుండా వారిపై కఠినంగా వ్యవహరించిన రాష్ట్ర ప్రభుత్వం వ్యవహారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధ మండల నాయకురాలు రేణుక అన్నారు. మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవహార శైలిని ఖండిస్తూ వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వేతనం 18000 ఇచ్చే వరకు దశల వారి పోరాటాలు చేస్తూనే ఉంటామని అన్నారు. హక్కులు అడిగితే నిర్బంధాలు చేస్తారా అంటూ ఆమె ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో అందరికీ అడిగే హక్కు ఉందనీ ప్రజాస్వామ్యం లో, ప్రజా పరిపాలన ఇదేనా అని ప్రశ్నించారు. హక్కులు అడుగితే అర్ధరాత్రి అరెస్టులు, నిర్బంధాలు, లాఠీచార్జిలా ఇలాంటి ప్రభుత్వాలను కార్మిక వర్గం ఇంటికి పంపిన చరిత్రలు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. ఆశా వర్కర్ల హక్కులకై ఐక్యంగా ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ పానుగల్ మండలంలోని ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

**మక్తల్, మార్చి 25 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు నెలకు కనీస వేతనంగా రూ. 18వేలు అందజేయడంతో పాటు చాలాకాలంగా పెండింగ్లో ఉన్న బకాయిలను చెల్లించి వారి సర్వీస్‌ను క్రమబద్దీకరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గోవిందరాజు డిమాండ్ చేశారు.ఇటీవల ఆశా కార్యకర్తల అక్రమ అరెస్టులను నిరసిస్తూ మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలతో కలిసి మక్తల్ పట్టణంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.కార్యక్రమంలో ఆశా కార్యకర్తలుగోవిందమ్మ, యశోద,సుజాత, అమీనా బేగం, ఇందిరా, వెంకటమ్మ, అనురాధ, అనిత, లక్ష్మి, పార్వతమ్మ,రసీదా బేగం, సంతోష, రేణుక, పద్మ, సావిత్రమ్మ, బాలమ్మ, అనురాధ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**బిజినేపల్లి, మార్చి 25 ప్రభాతవార్త:** ఆశ వర్కర్లకు కనీస వేతనం 18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ కోటి కమిషనరేట్ కార్యాలయం ముట్టడించిన ఆశా కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నమ్మ అన్నారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అక్రమ అరెస్టులకు నిరసనగా మంగళవారం అంబేద్కర్ చౌరస్తాలో ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. గతంలో సర్వే చేసిన లెప్రసీ, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సుభాకర్, సిపిఎం మండల కమిటీ సభ్యులు చంద్రశేఖర్, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు వసుంధర, కృష్ణవేణి, జయమ్మ, అలివేల, పార్వతి, శ్రీదేవి విజయనిలా, వెంకటమ్మ, వరలక్ష్మి, భాగ్యమ్మ, తిరుపతమ్మ, కృష్ణవేణి ఆయా గ్రామాల ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించిన న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

**గద్వాల, మార్చి 25 ప్రభాతవార్త :** మంగళవారం జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గంటా కవితా దేవి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వసతి సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనము ఇవ్వాలన్నారు. జడ్జి చొరవతో ప్రభుత్వ అధికారులు స్పందించి వంటశాలను, బాత్రూమ్స్ నిర్మాణాలు జరగటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇంకను పాఠశాల ప్రధాన ప్రహరీ గోడ, కిటికీలు ఏర్పాటు గురించి నిధులు మంజూరు అయ్యాయని, త్వరలోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సందర్భంగా తెలియజేశారు.

## డంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

**పెబ్బేరు, మార్చి 25 ప్రభాతవార్త :** పెబ్బేరు పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డ 3 ముగ్గురు వ్యక్తులకు వనపర్తి కోర్టు ప్రిన్సిపాల్ జ్యుడిషియల్ ప్రథమశ్రేణి న్యాయమూర్తి బి.రవి కుమార్ ఇద్దరి వ్యక్తులకు 2,రోజుల జైలుశిక్ష ఒక్కరికి వెయ్యి రూపాయలు జరిమానా విధించినట్లు పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్ రెడ్డి తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

■వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి టౌన్, మార్చి25 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులుతో కలిసి వైద్య అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు అన్నిరకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదే విధంగా, అన్ని పిహెచ్‌సిల పరిధిలో ఏఎన్సి( ప్రెగ్నెన్సీ) రిజిస్ట్రేషన్‌ల సంఖ్య పెరగాలని సూచించారు. ఆశ వర్కర్లతో డేటా తెప్పించుకొని గ్రూపులు ఏర్పాటు చేసిఏఎన్సీ( ప్రెగ్నెన్సీ) రిజిస్ట్రేషన్లు పెరిగేలా చర్యలు తీసుకోవాల న్నారు. ఆశా వర్కర్లతో రెగ్యులర్గా రివ్యూ మీటింగ్ కండక్ట్ చేసి ఏఎన్సీ రిజిస్ట్రేషన్‌లను పర్యవేక్షించాలన్నారు. వచ్చేనెల నుంచి పీహెచ్సీలలో ప్రసవాల సంఖ్య పెరగాలని సూచించారు. అదేవిధంగా శిశువుల్లో 100 వ్యాధి నిరోధక(ఇమ్యునైజేషన్) టీకాలు వేయించాలన్నారు. స్యామ్, మామ్ పిల్లలను మెరుగైన పురోగతి కోసం ఎన్ఆర్‌సికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 30 ఏళ్ల పైబడిన వారికి నిర్వహిస్తున్న మిషన్ మధుమేహ (డయాబెటిక్ పరీక్షలు) కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు ఎంత మేర పూర్తయిందని కలెక్టర్ ఆరాతీశారు. జిల్లాలో ఇప్పటివరకు 90 పూర్తి చేసినట్లు, ఇప్పటివరకు పరీక్షలు చేసిన వారిలో 2114 కొత్త డయాబెటిస్ కేసులు నిర్ధారణ అయినట్లు ఎన్సీడీ అధికారి బదులిచ్చారు.మార్చి 31లోపు మిషన్ మధుమేహ కార్యక్రమాన్ని 100 పూర్తి చేసి, వ్యాధి నిర్ధారణ అయిన వారి డేటాను ఆన్లైన్లో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రులకు వచ్చే రోగులకు ఓపిడి నమోదు సమయంలోనే అభా కార్డుల జనరేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. వందరోజుల టీబీ సర్వే కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచి కుటుంబ సంక్షేమ శాఖ తరపున అవార్డు దక్కించుకున్న నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఇలాగే రానున్న రోజుల్లో వైద్యారోగ్యశాఖ తరపున అన్ని కార్యక్రమాలనుముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. సమావేశంలో వైద్యశాఖ అధికారులు డా. సాయినాథ్ రెడ్డి, డా. రామచంద్ర, జిజిహెచ్ సూపరింటెండెంట్ రంగారావు, మెడికల్ ఆఫీసర్లు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.


వైద్య అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

# రూ.1 కోటి3 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణాలు పూర్తి

**అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ చొరవతో పంచాయతీరాజ్ కమిషనర్ సహకారంతో సిసి రోడ్లకు నిధులు మంజూరు**

**హర్షం వ్యక్తం చేసిన గ్రామాల ప్రజలు, రైతులు**

**ఇటిక్యాల, మార్చి 25 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మునగాల, నక్కలపల్లి, ఇటిక్యాల మండల కేంద్రంలోని కాలనీలో సిసి రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఏఐసీసీకార్యదర్శి అల్లంపూర్ మాజీఎమ్మెల్యే సంపత్ కుమార్ చొరవతో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సృజన సహకారంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిధుల మంజూరుకు సహాయ సహకారాలు అందించిన జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్‌పై గ్రామాలకు 17పనులకు రూ.1 కోటి 3 లక్షల నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చెయ్యగా వచ్చిన నిధులతో 3 గ్రామాలలో సీసీ రోడ్లకు నిర్మల్ పూర్తి చేసినట్లు కాంగ్రెస్ ముఖ్య నాయకులుకొప్పుల ప్రభాకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శాంతన్న ప్రభాతవార్తకు తెలిపారు. మునగాల గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు కొప్పుల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్అండ్‌బి రహదారి నుండి గోకర మయ్య దర్గా వరకు30 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం. అలాగే గ్రామంలోని ఎస్సీ కాలని. స్మశాన దారి పలు కాలనీలో రూ. 20 లక్షల సిసి రోడ్ల నిర్మాణం పూర్తి చేసినట్లు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ రహదారిపై రైతులు వర్షాకాలంలో వ్యవసాయ పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్న తరుణంలో రోడ్డు నిర్మాణంతో సులువుగా పంట పొలాలకు వెళ్లడానికి ఆస్కారంఉందన్నారు. అలాగే నక్కలపల్లి గ్రామంలో రూ. 25 లక్షల సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేసినట్లు ఒకేసారి రూ. 25 లక్షలు నిధులు మంజూరు కావడం వల్ల గ్రామ పంచాయతీ ముందున్న రహదారిని సిసి రోడ్డు నిర్మాణం పూర్తి చేసినట్టు కాంగ్రెస్ నాయకులు జైపాల్ రెడ్డి తెలిపారు.అలాగే ఇటిక్యాల మండల కేంద్రంలోని కాలనీలలో రూ. 28 లక్షలతో సి.సి రోడ్ల నిర్మాణాలను పూర్తి చేసినట్లు కాంగ్రెస్ నాయకులురామచంద్రారెడ్డి శాంతన్న వివరించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ కమిషనర్ సృజన,అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, జిల్లా కలెక్టర్ సహాయసహకారాలతో మరిన్ని నిధులు తీసుకొచ్చి కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని కాంగ్రెస్ ముఖ్య నాయకులుకొప్పుల ప్రభాకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తెలిపారు.


గోకరమయ్య దగ్గర 30 లక్షలతో పూర్తి చేసిన సి.సి రోడ్డు

**తోటకు నీరందడం లేదని మనస్థాపంతో**

## యువ రైతు ఆత్మహత్యాయత్నం

**పెబ్బేరు, మార్చి 25 ప్రభాతవార్త:** పెబ్బేరు మండల పరిధిలోని అయ్యవారి పల్లి గ్రామా నికి చెందిన యువరైతు కురుకుంట్ల శ్రీకాంత్ మంగళవారం తెల్లవారుజామున ఆత్మహత్యాయత్నం చేశారు.యువరైతు శ్రీకాంత్‌కు స్థానికంగా 15 ఎకరాల భూమి ఉంది. అందులో బోరు వేసి 6ఎకరాలలో బత్తాయి తోటసాగు చేస్తున్నారు. గత కొన్ని రోజుల క్రితం తన వ్యవసాయ భూమికి ప్రక్కనే ఉన్న పొలంలో బోరు వేశాడు. ఆయన బోరు వేయటంతో శ్రీకాంత్ బోరు ఇంకిపోయి బత్తాయి తోటకు నీరు అందకపోవటంతో తీవ్ర ఆందోళన చెందారు.ఇవాళ తెల్లవారుజామున సెల్ఫీ వీడియో తీసుకుని స్థానిక వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేసిన అనంతరం పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసుకున్నాడు.హుటాహుటిన పెబ్బేరుకు తరలించగా, స్థానికంగా ఉన్న మూడు ఆసుపత్రుల్లో ప్రయత్నం చేయగా వారు కర్నూలుకు రెఫర్ చేశారు.అంబులెన్స్‌లో కర్నూలు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించారు. చదువు పూర్తి చేసి ఉద్యోగం వైపు వెళ్లకుండా వ్యవసాయం చేసుకుంటూ కుటుంబానికిబాసటగా నిలవటంతో గ్రామంలో శ్రీకాంత్ యువతకు ఆదర్శంగా నిలిచారు. త్వరగా కోలుకోవాలని ప్రజలు భావిస్తున్నారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పరు పట్టివేత

**కృష్ణ, మార్చి 25 ప్రభాతవార్త:** కృష్ణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న యాదగిరి,కృష్ణ పోలీసు బృందం పెట్రోలింగ్ చేస్తుండగా తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో టై రోడ్డు నుండి చేగుంట వైపు వెళుతున్న (కె33బిటి7677) నెంబరు గల ఇసుక టిప్పరును పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుండటంతో టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్ఐ నవీద్ తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమ వ్యాపారాలు చేసే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## న్యాయవాది ఇజ్రాయిల్ హంతకులను కఠినంగా శిక్షించాలి

### -విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేసిన న్యాయవాదులు

**కల్వకుర్తి, మార్చి 25 ప్రభాతవార్త:** న్యాయవాది ఇజ్రాయిల్‌ను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కల్వకుర్తి బార్ అసోసియేషన్ నాయకులు కోరారు.న్యాయవాది హత్యకు నిరసనగా మంగళవారం విధులు బహిష్కరించి న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ హైదరాబాదులో పట్టపగలు యువ న్యాయవాది ఇజ్రాయిల్‌ను కత్తితో పొడిచి చంపడం దుర్మార్గచర్య అని కల్వకుర్తి న్యాయవాదులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కోర్టు విధులు బహిష్కరించి కోర్టు ఆవరణలో న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి నిందితులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదులపై దాడి చేయడం హేయమైనచర్య అని కఠినమైన చట్టాలు లేకపోవడం వలన న్యాయవాదులపై నిరంతరంగా దాడులు చేయడం, హత్య చేయడం సాధారణ విషయంగా మారిందని వారు తీవ్ర ఆవేదన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు వి.వెంకట్ రెడ్డి, జె.లక్ష్మినారాయణ, జి.వెంకట్‌గౌడ్, కృష్ణయ్య, బి.అమరేందర్, భాస్కర్ రెడ్డి, లక్ష్మణ్, రాజ్, జమీల్ అహ్మద్, నరేందర్ రెడ్డి, రామ్‌గోపాల్, కోట్ర మల్లేష్, నాగరాజ్,ముకురాలమల్లేష్, శ్రీకాంత్, శివకుమార్, ప్రశాంత్, ఆంజనేయులు, శ్రీను,సత్యంతదితర న్యాయవాదులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆస్తిపన్ను కట్టలేదని ఇంటిని సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు

**పెబ్బేరు, మార్చి 25 ప్రభాతవార్త:** పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో శ్రీరామ కాలనీలో ఒక ఇంటిని మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. కమిషనర్ అశోక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఇంటి యజమాని 2022 సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఇంటి పన్ను చెల్లించలేదని, ఇంటి కొలతలు తప్పు చెప్పడం వల్ల చట్టపరంగా అతని ఇంటిపై 25 శాతం అదనంగా జరిమానా విధించామని ఇప్పటికీ మొత్తం 3,52,251 రూపాయలు చెల్లించాలని ఇంటి పన్ను చెల్లించ నందున మంగళవారం అతని ఇంటిని సీజ్ చేసామని మున్సిపల్ కమిషనర్ తెలియజేశారు.


ఇంటి పన్ను కట్టనందుకు ఇల్లును సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు

## పండుగలు సోదరభావాన్ని నింపుతాయి

**నారాయణపేట టౌన్, మార్చి25 ప్రభాతవార్త:** పండుగలు ప్రజల్లో సోదరభావాన్ని నింపుతాయని భీమ్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా. కె.రాజ్ కుమార్ రెడ్డి అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులో నారాయణపేట ఈద్గా కమిటీ అధ్యక్షులు,మాజీ కౌన్సిలర్ అమీరుద్దీన్ ఆధ్వర్యంలో వారి నివాసంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపవాసం ఉన్నముస్లిం సోదరులకు రాజ్ కుమార్‌రెడ్డి పండ్లను తినిపించారు. అనంతరం రాజ్ కుమార్‌రెడ్డి మాట్లాడారు. పండుగలను అన్నివర్గాల ప్రజలుకలిసిమెలిసి జరుపుకోవడం సంతోషంగా ఉందని అన్నారు.వారి సమస్యలను తెలుసుకున్న ఆయన ఆయా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ అబ్దుల్‌సలీం,జాకీర్ హజారి,దస్తగిర్ చాంద్, మొయినుద్దీన్,మొహమ్మద్ తఖీమొజిన్,గౌస్, ఆరీఫ్, మొహ్మద్ ఇస్మాయిల్ హాజారి,ఈజాజ్ మడ్కీ,మొజిన్, ఫౌండేషన్ సభ్యులు గద్దం తిప్పన్న,మధుసూదన్‌రెడ్డి, హన్మంత్, శ్రీనివాస్ రెడ్డి,గోపాల్,శివరాజ్,నర్సింహులు,చామకూరనగేష్, ఎం.సంతోష్,నందుకుమార్,అధికసంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ధ్యానం తోనే మానసిక ప్రశాంతత

### ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కె. సుదర్శన్ రెడ్డి

**నారాయణపేట టౌన్, మార్చి25 ప్రభాతవార్త:** ధ్యానంతో మానసిక ప్రశాంతత పొందవచ్చునని ప్రముఖ జనరల్ ఫిజి షియన్ గందె కార్తీక్ కుమార్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మెన్ కె. సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం హార్ట్ ఫుల్ నెస్ సంస్థ, శ్రీరామ చంద్ర మిషన్ ఆధ్వర్యంలో కృష్ణ గోకులం పాఠశాలలో ఉచితంగా ధ్యాన శిబిరం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్నిఉద్దేశించి వారు మాట్లాడారు.ధ్యానంతో మానసిక ప్రశాంతతతో పాటు నిశ్చలత పొందవచ్చు అన్నారు. ప్రతిరోజు ధ్యానం చేయడాన్ని అలవాటుగా అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గద్దె అంజనేయులు మాజీ కౌన్సిలర్ అమ్మపల్లి శిరీష చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పట్టుదలతో చదవాలి

**లింగాల, మార్చి 25 ప్రభాతవార్త:** విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోధించారని ఆర్‌సివో కళ్యాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మీని గురుకులంలో వార్షికోత్సవ దినోత్సవం నిర్వహించారు. ఈ అనంతరం ఆర్‌సివో కళ్యాణి మాట్లాడుతూ కృషి పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అన్నారు.విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి అహర్నిశలు కృషి చేయాలని అన్నారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అదేవిధంగా పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ ఎంగా భార్గవితో పాటు 21 మంది విద్యార్థులు ఛాత్రోపాధ్యాయులుగా వ్యవహరించి విద్యాబోధన చేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోవర్ధన్, ఉపాధ్యాయబృందంభాగ్యలక్ష్మి,నీలవేణి, రాధా,దేవి పాల్గొన్నారు.

## 27న పాలెం డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

**బిజినేపల్లి, మార్చి25 ప్రభాతవార్త:** పాలెం శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నె 27 గురువారం ఉదయం 10గం.లకు ప్రముఖ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ డా.పి.రాములు మంగళవారం తెలిపారు.జాబ్ మేళాను జిల్లాలోని 33సంవత్సరాల లోపు వయస్సుకలిగి ఉండి పదవతరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా లేదా ఐటిఐ విద్యార్హతల గల నిరుద్యోగ యువతులు సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు.ఎంపికైన వారందరికీ 26 రోజులు పాటు హైదరాబాద్‌లో ఐఫోన్ పరికరాల తయారీ పై ట్రెయినింగ్ ఇస్తూ 15వేలు జీతంతో పాటు ఉచిత రవాణా, భోజనం సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.జాబ్ మేళాలో అధిక సంఖ్య లోనిరుద్యోగ యువతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## పేట తైబజార్ రూ.12 లక్షల 32 వేలకు వేలం

**నారాయణపేట టౌన్, మార్చి 25 ప్రభాతవార్త :** నారాయణపేట పురపాలక సంఘం 2025, 26 ఆర్థిక సంవత్సరానికి గాను తైబజార్ బహిరంగ వేలం రూ.12లక్షల 32 వేలు మాంసపు వ్యర్థాల సేకరణకై జరిగిన బహిరంగ వేలం రూ 48,0500/లకు వేలంపాట దక్కించుకోవటం జరిగిందని కమీషనర్ పురపాలక సంఘం నారాయణపేట భోగేశ్వర రావు తెలిపారు.

## శ్రీపడమటి భక్త ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయాభివృద్ధి కృషి చేస్తా

### -ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

**కల్వకుర్తి, మార్చి25 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని ఎల్లికల్ రోడ్డులో ఉన్న కైలాసం గుట్టుపై వెలసిన శ్రీ పడమటి భక్త ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా దేవాలయాభివృద్ధి కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పురం శేఖర్‌రెడ్డి, తిరపత్ రెడ్డి, వీరుమళ్ళ పాండు,బావండ్ల మధు, కే.శేఖర్ రెడ్డి, సురేష్ గౌడ్, బాలయ్య, పురం మహేశ్వర్ రెడ్డి, మల్లేష్, శ్రీనివాస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జాతర నూతన కమిటీ ఎన్నిక

**నారాయణపేట టౌన్, మార్చి25 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా అంబేద్కర్ జాతర నూతన కమిటీని మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కళాభవనంలో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ దళిత సంఘాల ఆధ్వర్యంలో మూడవ అంబేద్కర్ జాతర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు యు. మహేష్,ఉపాధ్యక్షులు అజీజ్, గ్యాంగ్ హనుమంతు, కళ్యాణ్ రాజ్, నర్సింలు పాతపల్లి, గడ్డం కృష్ణ,తిరుపతియాదవ్, ప్రధాన కార్యదర్శి బి.రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.మాధవ్, రవికుమార్, శ్యాం, గోపాల్, సహాకార్యదర్శిలుపద్మమ్మ, పద్మ కళ, గోపాలకృష్ణ, బి.గజలప్ప,బాల్ రాజ్, శంకర్, కోశాధికారి చంటి, ప్రచార కార్యదర్శి చిన్ని కృష్ణ, తిరుమలేష్, బొంబాయి రాములు, కృష్ణ మోర్, దుబాయ్ కృష్ణ,బర్ల ఆనంద్, సలహాదారులు కే.కృష్ణయ్య, సల్ల వెంకటేష్,టి.రాజుబైరంపల్లి నారాయణ, కె.పాండు, కృష్ణమద్దూర్,గౌరవఅధ్యక్షులు చిన్నయ్య,భరత్, కథలప్ప,పి రమేష్,అంబేద్కర్ జాతర సోషల్ మీడియా విభాగంకమిటీ అధ్యక్షులు లింగం ఉపాధ్యక్షులు సోఫీ, ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, అంబేద్కర్ జాతరమహిళా విభాగం కమిటీ అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, ఉపాధ్యక్షులు నాగమణి, ప్రధాన కార్యదర్శి టి. అనిత ఉన్నారు.

## అరెస్టులతో ఉద్యమని ఆపలేరు

**వంగూరు, మార్చి 25 ప్రభాతవార్త:** ప్రభుత్వం ఎన్నికల ముందుఇచ్చిన హామీలను నెరవేర్చాలని శాంతియుతంగా నిరసన తెలుపడానికి వెళ్తున్న ఆశ వర్కర్లను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం అప్రజాస్వామికమని ఆశవర్కర్ల మండల అధ్యక్షురాలు సూర్య కళ అన్నారు. మంగళవారం ప్రభుత్వం వైఖరిని వ్యతిరేకిస్తూ వంగూరు మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియూ వంగూరు మండల అధ్యక్షురాలు సూర్యకళ మాట్లాడుతూ ఆశలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆశల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్నిఅడగటానికి వెళితే అక్రమ అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. మహిళలు అని కూడా చూడకుండా బూట్ కాళ్లతో తన్ని అవమానపరచడం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.బాలస్వామి ఆశ వర్కర్ చేస్తున్న పోరాటాలకు మద్దతు తెలియజేస్తూ సమస్యను పరిష్కరించే వరకు వారికి అండగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి చంద్రకళ, సుమలత, సూర్య కళ, జ్యోతి, అలివేల, పద్మ, లక్ష్మమ్మ, ధనమ్మ, కవిత, సైదమ్మ, వసంత,తిరుపతమ్మ, అనసూయ, వెంకటమ్మ సుజాత, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## తైబజార్ వేలం పాట

**నారాయణపేట టౌన్, మార్చి 25 ప్రభాతవార్త :** దామరగిద్ద గ్రామ తైబజార్‌ను మంగళవారం గ్రామంలోని సంజీవరాయదేవరాయ ప్రాంగణంలోవేలం పాట నిర్వహించారు. ఒక్కొక్క వ్యక్తి రూ. 30 వేలు డిపాజిట్ పెట్టి నలుగురు వ్యక్తులు వేలం పాటలో పాల్గొన్నారు.వేలంపాటలో పాల్గొన్నవారిలో ఏర్పుల మాణిక్యప్ప,పుట్టితిరుపతి, పిచ్చుకుంట్ల హనుమంతు, సత్తి సైదప్ప బరిలో ఉండగా రూ. 1,51,500లకుఏర్పుల మాణిక్యప్ప వేలంపాడి కైవసం చేసుకున్నారు. అదేవిధంగా ఎడ్లసంత సైతం రూ.15 వేలకు వేలంపలికింది. అంతకు ముందు సంవత్సరం రూ. 1,52,500పలికింది. వేలంకార్యక్రమంలో ఎంపీడీవో సాయిలక్ష్మి, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి తిరుపతిరెడ్డి, గ్రామ పెద్దలు, కరోబార్‌యు. శివానంద్, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ప్రజా పాలనలో ఆశా కార్యకర్తలపై నిర్బంధం దారుణం

### ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం. బాలామణి

**నారాయణపేట టౌన్, మార్చి 25 ప్రభాతవార్త :** ప్రజా పాలన, ఇందిరమ్మ రాజ్యం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆశాలకు ఇచ్చిన మాట ప్రకారం కనీస వేతనం రూ.18 వేల అమలు చేయాలనీ కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆశా కార్య కర్తలు కోటి కమీషనరేట్ ముందు ధర్నాకు చేరుకుంటే ఈ ప్రభుత్వం ఆశలను కర్కశంగా అణచివేసిందని నిర్దాక్షిణంగా అరెస్టులుచేసి పోలీస్ స్టేషన్లో బంధిం చిందని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలమణి విమర్శించారు. అందువల్ల కాంగ్రెస్ ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసిస్తూ మంగళవారం ఆశ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో నల్ల బ్యాడ్జీలతో అంబేద్కర్‌చౌరస్తాలో నిరసనకార్యక్రమం నిర్వహించారు. నిరసన కార్యక్రమంలో పవన్ కుమార్, కాశప్పతో బాటు నిర్మల, లక్ష్మి ,శివమ్మ, నర్సమ్మ, రాధిక, మహేశ్వరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ తరలిన పంచాయతీ కార్మికులు

**బిజినేపల్లి, మార్చి25 ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో చేపట్టిన ధర్నా కార్యక్రమానికి బిజినేపల్లి మండలం కేంద్రానికి సంబంధించిన గ్రామ పంచాయతీ కార్మికులు తరలి వెళ్లారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలు చెల్లించాలని, వేతనాలకు బడ్జెట్ కేటాయించి, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు.